అస్మదీయుడికి.. అప్పనంగా..



కుళాయిచెరువుపార్కులో స్కేటింగ్ రింక్

- కాకినాడలో ఏడాదిన్నరగా కార్పొరేషన్ ఆదాయానికి వైసీపీ కోట్లలో గండి
- కుళాయిచెరువు స్కేటింగ్ రింకుకు టెండర్లు లేకుండా ద్వారంపూడి పెత్తనం
- కార్పొరేషన్‌కు రూపాయి ఆదాయం ఇవ్వకుండా అనుచరుడికి అంతా అప్పగింత
- సమ్మర్ కోచింగ్ క్యాంపు, శిక్షణ పేరుతో కోట్లలో జేబులు నింపేసుకున్న కాంట్రాక్టర్
- అయినా ద్వారంపూడికి వ్యతిరేకంగా కిక్కురుమనని కార్పొరేషన్ అధికారులు
- తాజాగా పిలిచిన కొత్త టెండర్‌ను కారుచౌకగా లాగేందుకు ద్వారంపూడి ఎత్తులు
- అప్రమత్తమైన ఎమ్మెల్యే కొండబాబు: అప్పటికప్పుడు బహిరంగ వేలానికి ఆదేశం
- ఏడాదికి రూ.21.75 లక్షలకు టెండర్ ఖరారు: కార్పొరేషన్‌కు ఆదాయం పంట

(కాకినాడ, ఆంధ్రజ్యోతి)

కాకినాడ కుళాయిచెరువు స్కేటింగ్ రింక్‌పై వైసీపీ మాజీ ఎమ్మెల్యే ద్వారంపూడి పెత్తనంతో కార్పొరేషన్‌కు కోట్లలో ఆదాయం గండిపడింది. చేతిలో అధికారం ఉన్నన్నాళ్లు యథేచ్ఛగా చెలరేగిపోయిన ద్వారంపూడి అధికారులను బెదిరించి తన అనుచరులకు స్కేటింగ్ రింకును అడ్డగోలుగా అప్పగించేశాడు. కార్పొరేషన్‌కు కోట్లలో ఆదాయం వచ్చే అవకాశం ఉన్నా దానికి గండికొట్టేసి తన అనుచరులకు ఉచితంగా కట్టబెట్టేశాడు. ఇంకేముంది.. అధికారులు జోలికి రాకపోవడం, ఎమ్మెల్యే అండదండలు పుష్కలంగా ఉండడంతో సదరు అనుచరుడు స్కేటింగ్ శిక్షణ పేరుతో దఫదఫాలుగా మూడేళ్లలో కోటిన్నర వరకు పిండేశాడు. ఇప్పుడు ప్రభుత్వం మారడంతో దీని నిర్వహణకు అధికారులు తాజాగా టెండర్ పిలవగా ద్వారంపూడి చౌకగా కొట్టేసే ప్లాన్ చేశాడు. విషయం తెలిసిన టీడీపీ ఎమ్మెల్యే కొండబాబు ఆఖర్లో అప్రమత్తమై నిర్వహణ బాధ్యత కాంట్రాక్టును బహిరంగవేలం ద్వారా ఖరారు చేయాలని ఆదేశించారు. దీంతో పోటీ పెరిగి కార్పొరేషన్‌కు మొట్టమొదటిసారిగా ఏడాదికి రూ.21.75లక్షల రాబడి ఖాయమైంది.

ఇష్టమొచ్చినట్లు ఇచ్చేశారు..

కాకినాడ నగరం నడిబొడ్డున కుళాయిచెరువు పార్కు ఉంది. ఇందులో అరెకరంలో భారీ స్కేటింగ్ రింక్ ఉంది. వైసీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే అప్పటి ఎమ్మెల్యే ద్వారంపూడి దీనిపై కన్నేశారు. శిక్షణ పేరుతో స్కేటింగ్ రింక్ ద్వారా భారీగా లాభం వచ్చే అవకాశం ఉండడంతో కార్పొరేషన్ అధికారులను బెదిరించి దీన్ని తన అనుచరులకు కట్టబెట్టేశారు. వాస్తవానికి స్కేటింగ్ రింక్ పూర్తిగా కాకినాడ కార్పొరేషన్‌ది. దీన్ని టెండర్ ద్వారా ప్రైవేటు వ్యక్తులకు కటబెడితే కార్పొరేషన్‌కు ఆదాయం వస్తుంది. కానీ ఎమ్మెల్యే ద్వారంపూడి నిబంధనలకు తూట్లు పొడిచారు. కార్పొరేషన్ ఆదాయానికి గండికొట్టి తన అనుచరుడికి దీన్ని ఉచితంగా కేటాయించారు. దీంతో సదరు వ్యక్తి దాదాపు ఏడాదిన్నర పాటు కార్పొరేషన్‌కు పైసా కట్టకుండా స్కేటింగ్ శిక్షణ ద్వారా కోట్లలో సంపాదించాడు. ఈ స్కేటింగ్ రింక్‌ను గతేడాది రూ.9.50కోట్ల స్మార్ట్‌సిటీ నిధులతో ఆధునికీకరించారు. ఈ నేపథ్యంలో దీని నిర్వహణను టెండర్ ద్వారా ప్రైవేటు వ్యక్తికి కార్పొరేషన్‌అధికారులు కట్టబెట్టాలి. ఇందుకోసం అధికారులు టెండర్లు పిలిచారు. కానీ ఎమ్మెల్యే ద్వారంపూడి బెదిరింపులతో ఎవరూ దీని నిర్వహణ కాంట్రాక్టు తీసుకోవడానికి భయపడి ముందుకు రాలేదు. ఈలోపు ఎన్నికల కోడ్ వచ్చేసింది. దీంతో ద్వారంపూడి హెచ్చరికలతో కార్పొరేషన్ అధికారులు దీనిజోలికి రాలేదు. దీంతో మళ్లీ తన అనుచరుడికే రెండోదఫా స్కేటింగ్ రింక్‌ను ఉచితంగా కట్టబెట్టేశారు. మొన్న అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు వచ్చేవరకు ఏడాదిన్నరగా సదరు ద్వారంపూడి అనుచరుడు కోటిన్నర వరకు స్కేటింగ్ రింక్ ద్వారా సంపాదించాడు. పైగా దమ్మిడి ఆదాయం కూడా కార్పొరేషన్‌కు ఇవ్వలేదు. పైగా ఈ ఏడాది వేసవి సమయంలో స్కేటింగ్ శిక్షణకు వందలాదిమంది పిల్లలు ఎగబడ్డారు. ఇదే అదనుగా సదరు ద్వారంపూడి అనుచరుడు స్పెషల్ సమ్మర్ స్కేటింగ్ కోచింగ్ పేరుతో ఒక్కో విద్యార్థికి రూ.2,500 వరకు ముక్కుపిండి వసూలు చేశాడు. ఇలా కోట్లలో ఆదాయం సంపాదించారు. రెండు విడతల్లో మూడేళ్ల పాటు రాబడిపోయినా కార్పొరేషన్ అధికారులు కిమ్మనలేదు.

ప్రభుత్వం మారడంతో తొలిసారి ఆదాయం

రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం అధికారంలోకి రావడంతో కొత్తగా మళ్లీ కార్పొరేషన్ అధికారులు ఈ స్కేటింగ్ రింక్ నిర్వహణకు టెండర్లు పిలిచారు. చేతిలో అధికారం లేకపోవడంతో మాజీ ఎమ్మెల్యే ద్వారంపూడి మాట వినే అధికారులు లేరు. ఈ నేపథ్యంలో తన అనచరుడితో చేసేదిలేక టెండర్లు దాఖలు చేయించారు. ఏడాదికి కార్పొరేషన్‌కు అతితక్కువగా రూ.13.99లక్షలు చెల్లించడానికి ఆసక్తి వ్యక్తీకరణ చేస్తూ తూర్పు గోదావరి రోలర్ స్పోర్ట్స్ అసోసియేషన్ పేరుతో టెండర్ వచ్చింది. ఇదికాక మరో నలుగురు టెండర్లు వేయగా, ఒకటి తిరస్కరణకు గురైంది. మిగిలిన అందరిలో ద్వారంపూడి అనుచరుడు దాఖలు చేసిన రూ.13.99 లక్షల బిడ్ అతిపెద్దది కావడంతో కారుచౌక ధరకు స్కేటింగ్‌రింకును కట్టబెట్టడానికి అంతా సిద్ధమైపోయింది. కానీ ఈలోపు విషయం కాకినాడసిటీ టీడీపీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు దృష్టికి వెళ్లింది. అతి తక్కువ ధరకు స్కేటింగ్ రింకు కట్టబెడితే కార్పొరేషన్‌కు ఆదాయం పోయి, ప్రైవేటు వ్యక్తి భారీగా లాభపడతారని గుర్తించారు. దీంతో కమిషనర్ వెంకటరావుతో చర్చించారు. అందులోభాగంగా అప్పటికప్పుడు బహిరంగ వేలం నిర్వహించేలా ఆదేశాలు జారీ చేశారు. ఈ నేపథ్యంలో మరికొందరు కొత్తగా వేలంలో పాల్గొన్నారు. చివరకు పోటీ పెరిగి స్కేటింగ్ రింక్ టెండర్ జీఎస్టీ పోను రూ.21.75 లక్షలకు వెళ్లింది. దీంతో ఒక్కసారిగా కార్పొరేషన్‌కు రాబడి పెరిగినట్లయింది. అటు కారుచౌకగా టెండర్ కొట్టేద్దామన్న మాజీ ఎమ్మెల్యే ద్వారంపూడి ఎత్తుగడ టీడీపీ ఎమ్మెల్యే కొండబాబు అధికారులతో చిత్తు చేయించారు. ఇకపై టీడీపీ ప్రభుత్వం చొరవతో ఏటా కార్పొరేషన్‌కు భారీగా రాబడి రానుంది.

స్కేటింగ్ రింక్ కోసం వేలం పాట

కార్పొరేషన్(కాకినాడ),జూన్ 27: కాకినాడ వివేకానంద పార్కులోని స్కేటింగ్ రింక్ నిర్వహణ కోసం వేలం పాట నిర్వహించారు. స్మార్ట్‌సిటీ కార్యాలయంలో స్మార్ట్‌సిటీ సీఈవో, ఎండీ నగరపాలక సంస్థ కమిషనర్ జె.వెంకటరావు సమక్షంలో జరిగిన పాటలో ఐదుగురు పాల్గొన్నారు. రోలర్‌స్కేటింగ్ అసోసియేషన్ తరుపున వేసిన రూ.21.75 లక్షల అత్యధిక టెండర్‌ను ఖరారు చేశారు. ఏడాదిపాటు నిర్వహణ కోసం ఈ టెండర్ పిలిచారు. స్మార్ట్ సిటీ సూపరింటెండెంట్ ఇంజనీర్ పి.వెంకటరావు పాల్గొన్నారు.

విస్తారంగా వాన



తునిలో జాతీయ రహదారిపై ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షం



వాన కురుస్తుండడంతో వెలవెలబోతున్న కాకినాడ సర్పవరం సెంటర్

- జిల్లావ్యాప్తంగా ఎడతెరిపిలేని వర్షం
- చల్లబడిన వాతావరణం

కలెక్టరేట్ (కాకినాడ), జూన్ 27: జిల్లావ్యాప్తంగా గురువారం విస్తారంగా వర్షం కురిసింది. కాకినాడ నగరంతోపాటు అన్ని మండలాల్లోను తెల్లవారు జాము నుంచి రాత్రి వరకు ఎడతెరిపి లేకుండా వర్షం కురిసింది. కాకినాడ నగరంలోని మెయిన్‌రోడ్డు, సినిమారోడ్డు, పల్లపు ప్రాంతాల్లో వర్షపు నీరు నిలిచి పోయింది. దీంతో స్థానికులు అనేక ఇబ్బందులు పడ్డారు.

జూలై 1 నుంచి ఎన్టీఆర్ భరోసా పింఛన్: కలెక్టర్



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్

కలెక్టరేట్(కాకినాడ), జూన్ 27: రాష్ట్ర ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు జూలై 1వతేదీ నుంచి ఎన్టీఆర్ భరోసా పింఛన్ పంపిణీకి పటిష్ట చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ సగిలి షాన్ మోహన్ ఆదేశించారు. కాకినాడ కలెక్టరేట్‌లో జిల్లా గ్రామీణ అభివృద్ధి, పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం సామాజిక భద్రత పింఛన్లను రానున్న జూలై నెల నుంచి ఎన్టీఆర్ భరోసా పేరుతో పంపిణీ చేపట్టనుందన్నారు. జూలై నెలలో రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ఎన్టీఆర్ భరోసా పేరుతో 17 రకాల పింఛన్లు జిల్లాలో 2,79,319మందికి రూ.188.40కోట్ల పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు ఏప్రిల్, మే, జూన్ నెలలకు సంబంధించి రూ.3వేలు, నూతనంగా పెంచిన పింఛన్ సొమ్ముతో రూ.4వేలతో కలిపి మొత్తం రూ.7వేలు పంపిణీ చేస్తామన్నారు. అనంతరం అమరావతి సీఎస్ కార్యాలయం నుంచి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నీరబ్‌కుమార్‌ప్రసాద్ అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. సమావేశంలో జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ శ్రీరమణి, పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ ప్రియంవద, డీపీఎంలు పాల్గొన్నారు.

డయేరియా వ్యాప్తిని నిరోధించేందుకు చర్యలు

- జిల్లా కలెక్టర్ షాన్ మోహన్

కలెక్టరేట్(కాకినాడ), జూన్ 27: జిల్లాలో డయేరియా వ్యాధిపట్ల ప్రజలు ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని కలెక్టర్ సగిలి షాన్ మోహన్ తెలిపారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో డయేరియా వ్యాధి నియంత్రణకు అన్నిచర్యలు తీసుకున్నామన్నారు. అన్ని గ్రామాలు, మున్సిపాలిటీలతోపాటు వసతిగృహాలు, అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలల్లో మంచినీరు ట్యాంకులకు క్లోరినేషన్ ప్రక్రియ నిర్వహించడం జరుగుతుందన్నారు. తాగునీటి పరీక్షలు నిర్వహిస్తున్నామన్నారు. తాగునీరు పైపు లైన్ల తనిఖీ, లీకేజీలు, మరమ్మతుల పనులు చేపట్టామన్నారు. మంచినీరు ట్యాంకుల క్లోరినేషన్ ప్రక్రియ, గ్రామాల్లో పారిశుధ్యం కార్యక్రమాలు నిరంతరం రోజుకు రెండుసార్లు చొప్పున సాగుతున్నాయన్నారు. జిల్లాలో అన్ని గ్రామాల్లో మెడికల్ క్యాంపులు నిర్వహించి ఐరన్ ట్యాబెట్లు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందిస్తామన్నారు. గ్రామాల్లో ఇంటింటికీ సర్వే నిర్వహించి ఎవరైనా వాంతులు, విరేచనాలు అయ్యే అవకాశం ఉంటే వారిని గుర్తించి వారికి మందులు అందిస్తామన్నారు. ప్రజలు కాచి చల్లార్చిన వేడి నీళ్లు తాగాలన్నారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవడంతోపాటు నీటిని నిల్వచేసే బిందులు, డ్రమ్ములను కూడా శుభ్రం చేసుకోవాలన్నారు.

డీసీసీబీ పర్సన్ ఇన్‌ఛార్జ్‌గా జేసీ

కాకినాడ రూరల్, జూలై 27: కాకినాడ డీసీసీబీ పర్సన్ ఇన్‌ఛార్జ్‌గా జేసీ రామసుందర్‌రెడ్డిని నియమిస్తూ గురువారం ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బి.రాజశేఖర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటివరకూ డీసీసీబీ చైర్మన్‌గా పనిచేసిన ఆకుల వీర్రాజు సార్వత్రిక ఎన్నికల్లో వైసీపీ ఓటమి చెందడంతో రాజీనామా చేశారు. ఈ కారణంగా ప్రభుత్వం జేసీని పర్సన్ ఇన్‌ఛార్జ్‌గా నియమించింది.

డయేరియా బాధితులకు పరామర్శ

- సామర్లకోట ప్రభుత్వాస్పత్రిలో ఉన్నతాధికారుల పర్యటన
- బాధితులు బయట బిర్యానీ తినడంవల్లే ఆహారం కలుషితమైందని ప్రాథమికంగా నిర్ధారణ
- పట్టణంలో తాగునీటి ఓహెచ్ఆర్ ట్యాంకులు పరిశుభ్రం



సామర్లకోటలో బాధితులను పరామర్శిస్తున్న జిల్లా డయేరియా అధికారి, మున్సిపల్ కమిషనర్

సామర్లకోట, జూన్ 27: సామర్లకోట పట్టణ పరిధిలో విరేచనాలతో డయేరియా బారిన పడి ప్రభుత్వాస్పత్రిలో చికిత్సలు పొందుతున్న బాధితులను జిల్లా ఉన్నతాధికారుల బృందం గురువారం సందర్శించింది. సామర్లకోటలో మూడు డయేరియా కేసులు పేరిట ఆంధ్రజ్యోతిలో గురువారం కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. దీంతో పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప సత్వరం స్పందించారు. మున్సిపల్ కమిషనర్ జాస్తి రామారావుతో సామర్లకోట పట్టణంలో డయేరియా వ్యాప్తిపై సమాచారాన్ని సేకరించారు. తాగునీరు కలుషితం కాకుండా ముందస్తుగా నాలుగు ఓహెచ్ఆర్ ట్యాంకులను పరిశుభ్రం చేయించాలని, తాగునీటిలో పీహెచ్ శాతం ఎంతమేర ఉందో తెలుసు కునేందుకు అన్ని వార్డుల్లోను కుళాయిలనుంచి సరఫరా అయ్యే తాగునీటి నమూనాలను సేకరించి విశ్లేషించి తగుచర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే ఆదేశించారు. జిల్లా ఉన్నతాధికారులతో చర్చించిన మేరకు జిల్లా డయేరియా అధికారి డాక్టర్ రత్నకుమార్, ప్రజారోగ్య శాఖ సూపరింటెండెంట్ ఇంజనీర్ ఎండీ హుస్సేన్, మున్సి పల్ కమిషనర్ జాస్తి రామారావును వెంట బెట్టుకుని పట్టణంలో ఫిల్టర్‌వాటర్స్కీం, కమ్యూనిటీ హెల్త్ సెంటర్, డయేరియా బాధిత ప్రాంతాలైన కుమ్మరివీధి, బ్రౌన్‌పేట, పెన్షన్‌లైన్ తదితర ప్రాంతాలను క్షుణ్ణంగా పరిశీలించారు. తాగునీటి ట్యాంకులను పరిశుభ్రం చేసి కొత్తగా క్లోరినేషన్ చేసిన తాగునీటిని పంపింగ్ చేశారు. క్లోరినేషన్ చర్యల తర్వాత తాగునీటిలో పీహెచ్‌శాతం ఎంతమేర నిలకడగా ఉందో తెలుసుకున్నారు. అనంతరం కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు చేరుకుని స్థానిక వైద్యులతో కలిసి డయేరియా జిల్లా అధికారి డాక్టర్ రత్నకుమార్ బాధితులనుంచి డయేరియావ్యాప్తికిగల వాస్తవ సమాచారాన్ని సేకరించారు. అధికారుల బృంద సభ్యులు విలేఖరులతో మాట్లాడుతూ బుధవారం విరేచనాలతో డయేరియా బారిన పడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వారు బయట విక్రయించే బిర్యానీ భుజించడంవల్ల ఆహారం కలుషితమై విరేచనాలకు వెళ్లినట్టు తమ ప్రాథమిక విశ్లేషణలో నిర్ధారణ అయ్యిందన్నారు. తాగునీరు ఎక్కడా కలుషితమైన దాఖలాలు లేవన్నారు. సచివాలయాల సిబ్బంది, అంగన్‌వాడీ సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశవర్కర్లు సమష్టిగా ఆయా వార్డుల్లో తాగునీటి నమూనాలను సేకరించి విశ్లేషించామన్నారు. పీహెచ్ ప్రమాణాలకు అనుగుణంగా తాగునీరు సరఫరా అవుతుందన్నారు.

లారీ ట్యాంకర్ల ద్వారా తాగునీరు పంపిణీ

గత శనివారం సామర్లకోట మండలంలోని వేట్లపాలెంలో పలువురికి డయేరియా వ్యాప్తి చెంది చికిత్సలు పొందగా వారిలో ఒక మహిళ మృతి చెందిన విషయం తెలిసిందే. ఇప్పటికే వేట్లపాలెంలో తాగునీటిని శుద్ధి చేసే ప్రక్రియ పూర్తి చేసినా ప్రజలకు మరింత మెరుగైన తాగునీటిని సరఫరా చేసేందుకు సామర్లకోట మున్సిపాల్టీలోఉన్న తాగునీటిని లారీ ట్యాంకర్ల ద్వారా వేట్లపాలెం ప్రజలకు సరఫరా చేయాలని ఎమ్మెల్యే చినరాజప్ప ఆదేశించడంతో కమిషనర్ రామారావు సత్వరం ట్యాంకుల ద్వారా క్లోరినేషన్ చేసిన తాగునీటిని వేట్లపాలెం పంపారు. గురువారం నాటికి వేట్లపాలెంలోను, సామర్లకోట పట్టణంలోనూ డయేరియా బారిన పడి ప్రభుత్వ ఆస్పత్రులకు ఎవరూ చేరలేదని ఆసుపత్రుల వైద్యసిబ్బంది పేర్కొన్నారు.

మరింత మెరుగ్గా 'ఉపాధి హామీ'



- కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో కోటి ఆశల్లో కూలీలు, ఉద్యానవన రైతులు

తునిరూరల్, జూన్ 27: వైసీపీ ప్రభుత్వ ఐదేళ్ల పాలనలో వ్యవస్థలు అన్నీ నిర్వీర్యం అయ్యాయి. కక్ష కట్టినట్లు కొన్ని పథకాలు అమల్లో నిర్లక్ష్యం చూపింది. ఇలాంటి వాటిలో జాతీయగ్రామీణ ఉపాధి హామీ పథకం(ఎన్ఆర్‌జీఎస్) ఒకటి. వలసల నివారణ కోసం తీసుకొచ్చిన ఈ పథకంలో రక్షణ, భూగర్భ జలాల పరిరక్షణ తదితర కీలక అంశాలు ఉన్నాయి. గతాన్ని పరిశీలించినా రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా ఈ పథకం ద్వారా కూలీలకు లబ్ధి చేకూర్చేవారు. దీనికి భిన్నంగా గత వైసీపీ ప్రభుత్వం కూలీలకు కల్పించాల్సిన సదుపాయాల్లో కోత విధించింది. జిల్లాలో 2.77లక్షల జాబ్‌కార్డులు ఉండగా 2.1లక్షల పైబడి కూలీలు పనుల్లో పాల్గొంటారు. ఎండలో పనిచేసే ఈ కూలీలకు కొద్దిసేపు విశ్రాంతి తీసుకునేందుకు టెంట్లు, కూలీలకు ఏమైనా జరిగితే తక్షణమే ప్రాథమిక వైద్యం అందించేందుకు మెడికల్ కిట్లు అందుబాటులో లేకుండా చేసింది. జిల్లాలో 20మండలాల్లో పంచాయతీల్లో పరిస్థితి ఇలాగే కొనసాగింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడం కీలకమైన గ్రామీణాభివృద్ధిశాఖ జనసేన అధినేత పవన్‌కల్యాణ్‌కు కేటాయించడంపై తమకు మేలు జరుగుతుందని ఉపాధి హామీ కూలీలు, ఉద్యానవన రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం హయంలో ఉపాధి కూలీలకు వేతన సవరణ మరింత మెరుగ్గా ఉంటుందని వారంతా ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. రైతుల భూముల్లో ఉద్యాన పంట సాగు, నీరు నిల్వ ఉండేలా పనులపై దృష్టి సారించాలని ఇప్పటికే మంత్రి అధికారుల సమీక్షలో చర్చించడంపై వాటి అమలుకోసం రైతులు ఆశగా ఎదురుచూస్తున్నారు. ఉద్యాన పంటలతో ఉపాధి హామీ పథకాన్ని అనుసంధానం చేస్తూ మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత జిల్లామంత్రి పవన్‌కల్యాణ్ తొలి సంతకం చేశారు. దీంతో రైతుల్లో ఆనందం వ్యక్తం చేస్తున్నారు. సాధారణంగా రైతులు ఐదెకరాల విస్తీర్ణంలో తోటల పెంపకం చేపడతారు. పెట్టుబడుల ఖర్చులు భారంగా మారుతున్న నేపథ్యంలో ఉపాధి హామీతో ఉద్యాన పంటల సేద్యాన్ని సమ్మిళతం చేయడంవల్ల ఉపశమనం కలుగుతుందని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో 33,700హెక్టార్లలో ఉద్యానవన పంటలు సాగవుతున్నాయి. మామిడి, జీడిమామిడి, ఆయిల్‌పాం, కొబ్బరి, అరటి, ఇతర పండ్ల జాతులతోపాటు పూలతోటలు సాగు చేస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో 2లక్షల హెక్టార్ల ఈ పంటలు సాగు అవుతున్నట్లు తెలుస్తోంది. ఒక ఎకరానికి ఒక్క ఏడాదికి రూ.10వేల విలువైన పనులు ఉపాధి హామీ ద్వారా చేపట్టినా ఏడాదికి రూ.200 కోట్ల పనులు ఉద్యాన పంట క్షేత్రాల్లో చేసుకునేందుకు వీలు కలుగుతుంది.

ఉపాధి హామీ పనులు ప్రతిపాదనలు సిద్ధం చేయాలి: కలెక్టర్

కలెక్టరేట్(కాకినాడ), జూన్ 27: ఉపాధి హామీ పనులు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ సగిలి షాన్‌మోహన్ అధికారులను ఆదేశించారు. కాకినాడ కలెక్టరేట్‌లో జిల్లా నీటి యాజమాన్య సంస్థ, పంచాయితీ, జిల్లా పరిషత్తు, పంచాయతీరాజ్, ఆర్డబ్ల్యూఎస్, పశుసంవర్ధక, ఉద్యానవనశాఖ అధికారులతో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో అన్ని మండలాలు, జిల్లా పరిషత్‌వారీగా 15వ ఆర్థిక సంఘం, సాధారణ నిధులతో చేపట్టిన పనులు ఖర్చులు వాటి వివరాలను ఈ నెలాఖరులోగా సమర్పించాలన్నారు. జాతీయ ఉపాధి హామీ పథకం నిధులతో వ్యవసాయ, పశుసంవర్ధక, ఉద్యానవన, ఐసీడీఎస్, పంచాయతీరాజ్ తదితర శాఖల్లో ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. ఉపాధి హామీ పథకం పనిదినాల సంఖ్య కనుగుణంగా పనుల్లో పురోగతి కనబర్చాలన్నారు. సమావేశంలో డ్వామా పీడీ వెంకటలక్ష్మి, డీపీవో భారతిసౌజన్య, పశుసంవర్ధకశాఖ జేడీ సూర్యప్రకాశరావు, జడ్పీ డిప్యూటీ సీఈవో రామ్‌గోపాల్, ఉద్యానశాఖ అధికారి మల్లిఖార్జునరావు, ఆర్డబ్ల్యూఎస్ఎస్ఈ శ్రీనివాసు పాల్గొన్నారు.

కాకినాడ చేరుకున్న మంత్రి నాదెండ్ల మనోహర్



- ఘనస్వాగతం పలికిన జనసేన, టీడీపీ నేతలు
- పుష్పగుచ్ఛంతో స్వాగతం పలికిన కలెక్టర్

కాకినాడలో పౌరసరఫరాలశాఖ మంత్రి నాదెండ్లకు ఆహ్వానం పలుకుతున్న టీడీపీ, జనసేన నేతలు



మంత్రి నాదెండ్లకు స్వాగతం పలుకుతున్న కలెక్టర్ షాన్ మోహన్, జేసీ రామ్‌సుందర్‌రెడ్డి

కలెక్టరేట్(కాకినాడ), జూన్ 27: రాష్ట్ర పౌరసరఫరాలశాఖ, వినియోగదారుల వ్యవహారాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ రెండురోజుల పర్యటనలో భాగంగా గురువారం రాత్రి కాకినాడ జిల్లాకు చేరుకున్నారు. ఆయన శుక్రవారం కాకినాడ కలెక్టరేట్‌లో జరిగే సమీక్షా సమావేశాలకు హాజరుకానున్నారు. కాకినాడ జిల్లాలో ఆయనకు జనసేన, టీడీపీ, బీజేపీ నేతలు ఘన స్వాగతం పలికారు. అనంతరం మంత్రి నాదెండ్లకు జిల్లా కలెక్టర్ సగిలి షాన్ మోహన్ పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. ఆయన వెంట జేసీ రామ్‌సుందర్‌రెడ్డి, కాకినాడ ఆర్డీవో ఇట్ల కిశోర్ ఉన్నారు.



నిలిచిపోయిన పర్యాటక బోట్లు

పెరుగుతున్న గోదావరి

పాపికొండల విహారయాత్ర బోట్లు నిలుపుదల

దేవీపట్నం, జూన్27: ఇటీవల కురుస్తున్న వర్షాలకు ఎగువ ప్రాంతాల నుంచి వర్షపు నీరు రావడంతో గోదావరి నెమ్మదిగా పెరుగుతోంది. దీనికి తోడు తుఫాన్ కారణంగా వర్షాలు కురుస్తుండడంతో గోదావరి నీటి మట్టం మరింత పెరిగే అవకాశమున్నట్లు తెలుస్తుంది. గోదావరి పెరుగుదల, తుఫాన్ కారణంగా పాపికొండలు విహార యాత్ర తాత్కాలికంగా నిలిపివేసినట్లు అధికారులు తెలిపారు. అయితే మండలంలో గురువారం ఉదయం నుంచి ఎడతెరిపి లేకుండా వర్షం కురవడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.

నేటి నుంచి నాదెండ్ల మనోహర్ పర్యటన

కలెక్టరేట్(కాకినాడ), జూన్ 27: రాష్ట్ర పౌర సరఫరాల శాఖ, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ శుక్ర, శనివారాలలో కాకినాడలో పర్యటించనున్నారు. శుక్రవారం ఉదయం 10 గంటలకు కాకినాడ కలెక్టరేట్‌లో జిల్లా అధికారులు, పౌరసరఫరా సంస్థ అధికారులు, ప్రజాప్రతినిధులతో ప్రజా పంపిణీ వ్యవస్థ పనితీరుపై సమావేశం నిర్వహించనున్నారు. అనంతరం ఉదయం 11.30 గంటలకు క్షేత్రస్థాయిలో ఆకస్మిక తనిఖీ ద్వారా రేషన్ బియ్యం పంపిణీని పరిశీలించనున్నారు. శనివారం ఉదయం 10 గంటలకు కలెక్టరేట్‌లో రేషన్ డీలర్లు, ఎండీయూ వాహనదారులు, కార్డుదారులతో సమావేశమవుతారు. జిల్లాలో రబీ సీజన్‌లో చేపట్టిన ధ్యానం సేకరణ, కనీస మద్దతు ధర చెల్లింపు తదితర అంశాలపై ఆయా శాఖల సంబంధిత అధికారులు, రైతులతో మంత్రి నాదెండ్ల మనోహర్ సమావేశం నిర్వహిస్తారు. గురువారం రాత్రి మంత్రి నాదెండ్ల కాకినాడ చేరుకున్నారు.

జాతీయ రహదారుల పనుల పురోగతిపై సమీక్ష

కలెక్టరేట్(కాకినాడ) జూన్ 27: జిల్లాలో జాతీయ రహదారుల పనుల పురోగతిపై గురువారం కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ సగిలి షాన్‌మోహన్, జిల్లా జాయింట్ కలెక్టర్ రామ్‌సుందర్‌రెడ్డి తదితరులు రెవెన్యూ, రోడ్లు, భవనాలు, ఎన్‌హెచ్‌ఏఐ ఇంజనీరింగ్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ మాట్లాడుతూ కాకినాడ నుంచి రాజమండ్రి వరకు నిర్మించే రహదారి, వాకలపూడి నుంచి అన్నవరం, కత్తిపూడి నుంచి అమలాపురం వరకు నిర్మిస్తున్న రహదారుల ప్రస్తుత పరిస్థితిని వివరించారు. రహదారుల పనులపై ప్రత్యేక దృషి పెట్టాలన్నారు. భూసేకరణ సమస్యలు అధిగమించే విధంగా ఎన్‌హెచ్‌ఏఐ ఇంజనీరింగ్ అధికారులు, రెవెన్యూ సర్వే సమన్వయంతో పనిచేయాలన్నారు. పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ఆయనకు అధికారులు వివరించారు. ఈ కార్యక్రమంలో కాకినాడ, పెద్దాపురం ఆర్డీవోలు ఇట్ల కిశోర్, సీతారామారావు, రోడ్లు, భవనాల, ఎన్‌హెచ్‌ఏఐ ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

రూ. 1.25 కోట్ల విలువైన

మద్యం ధ్వంసం



మద్యం సీసాల ధ్వంసం

సర్పవరం జంక్షన్, జూన్ 27: కాకినాడ జిల్లాలో రెండేళ్ల కాలవ్యవధిలో ఎస్ఈబీ, పోలీసులు నిర్వహించిన దాడులు, తనిఖీల్లో పట్టుబడిన సుమారు రూ. 1.25 కోట్ల విలువైన 32 వేల లీటర్ల మద్యం బాటిల్స్‌ను గురువారం ధ్వంసం చేశారు. కాకినాడ రూరల్ సూర్యారావుపేట ఎన్టీఆర్ బీచ్‌లో గురువారం జిల్లా ఎస్పీ ఎస్.సతీష్‌కుమార్ ఆధ్వర్యంలో ఏఎస్పీ,సెబ్ శ్రీలక్ష్మి పర్యవేక్షణలో పోలీసులు ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ సతీష్‌కుమార్ మాట్లాడుతూ జిల్లాలో అక్రమ మద్యం, అక్రమ నాటుసారా రవాణాపై ఉక్కుపాదం మోపినట్లు చెప్పారు. ఎస్ఈబీ, పోలీసుల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న దాడులు, తనిఖీలు మంచి ఫలితాలను ఇస్తున్నాయన్నారు. రెండేళ్ల కాలవ్యవధిలో నిర్వహించిన దాడుల్లో అక్రమంగా రవాణా అవుతున్న 94,737 మద్యం బాటిల్స్, 12,532.45 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నామన్నారు. కోర్టు ఉత్తర్వుల మేరకు సెబ్, పోలీసులు, రెవెన్యూ అధికారుల సమక్షంలో 32 వేల లీటర్ల మద్యం బాటిల్స్, నాటు సారాను రోడ్డు రోలర్‌తో ధ్వంసం చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఏఎస్పీ జె.రామ్‌కుమార్, కాకినాడ ఎస్‌డీపీవో కె.హనుమంతరావు, పలువురు సెబ్, లా అండ్ ఆర్డర్ సీఐలు, ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

ఉమ్మడి 'తూర్పు' జిల్లాలో పలువురికి పది లోపు ర్యాంకులు

ఏపీపీజీసెట్ -2024

ఫలితాలు విడుదల

సత్తాచాటిన విద్యార్థులు

కాకినాడ రూరల్, జూన్ 27: రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న పీజీ కళాశాలల్లోని సీట్ల భర్తీ కోసం నిర్వహించిన ఏపీపీజీసెట్-2024 ఫలితాలను గురువారం విడుదల చేశారు. ఈ ఫలితాల్లో కాకినాడ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ, తూర్పుగోదావరి, అల్లూరి సీతారామరాజు జిల్లాలకు సంబంధించి పలువురు విద్యార్థులు వివిధ విభాగాల్లో పదిలోపు ర్యాంకులు సాధించారు. అల్లూరి సీతారామరాజు జిల్లా హుకుంపేటకు చెందిన బాలచంద్ర పటి బీఎఫ్ఏలో రాష్ట్రస్థాయిలో 6వ ర్యాంకును సాధించారు. కంప్యూటర్ సైన్స్‌లో కాకినాడ జిల్లా కాకినాడ రూరల్ మండలం రమణయ్యపేటకు చెందిన కేదరి శ్రీసాయివినయ్ 2వ ర్యాంకు, సామర్లకోట మండలం అచ్చంపేటకు చెందిన కుమ్మరి నితిన్‌సాగర్ 8వ ర్యాంకు, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాకు చెందిన అంతర్వేది మాధురి 10వ ర్యాంకు పొందారు. ఎంఏ ఎడ్యుకేషన్‌లో కాకినాడ జిల్లా యు.కొత్తపల్లి మండలం నాగులాపల్లికి చెందిన దడాల అయ్యా రాజశేఖర్ 9వ ర్యాంకును, ఎఫ్ఎన్ఎస్‌లో తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరానికి చెందిన అద్దేపల్లి వసంతి 7వ ర్యాంకు, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రాయవరం మండలం కమ్మవారివీధికి చెందిన సత్తి బ్రహ్మవర్ధిని 12వ ర్యాంకును, కె.గంగవరానికి చెందిన నాగులాపల్లి హేమలత 12వ ర్యాంకు సాధించారు. జనరల్ సబ్జెక్టులో తూర్పుగోదావరి జిల్లా బిక్కవోలుకు చెందిన కోనమహాలక్ష్మి 6వ ర్యాంకు, హిందీలో కాకినాడ రూరల్ మండలం ఇంద్రపాలేనికి చెందిన పాలిక పూజిత 1వ ర్యాంకు, అదే ప్రాంతానికి చెందిన పాలిక సాయిసుష్మిత 6వ ర్యాంకు, హిస్టరీలో కాకినాడ రంగయ్యనాయుడు వీధికి చెందిన అడపా శ్రీసత్య 6వ ర్యాంకును, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రాయవరానికి చెందిన టీవైఎస్ ఈశ్వరరావు 6వ ర్యాంకును పొందారు. కెమికల్ సైన్సెస్ విభాగంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురానికి చెందిన బిక్కిన సత్యప్రియ రెండో ర్యాంకు సాధించింది. ఇంగ్లీష్‌లో తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరానికి చెందిన కుప్పల శ్రావ్య 11వ ర్యాంకు సాధించింది. లైఫ్ సైన్సెస్‌లో తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరానికి చెందిన శ్రీనివాసుల తేజో వెంకటవీణ సుష్మ 1వ ర్యాంకు సాధించింది. మేథమెటికల్ సైన్సెస్‌లో కాకినాడ జిల్లా పెద్దాపురానికి చెందిన మోరుకుర్తి లక్ష్మీ తేజస్విని 2వ ర్యాంకు, పెదపూడికి చెందిన కారెడ్ల శిరీష 4వ ర్యాంకు, కాకినాడ రూరల్‌కు చెందిన చోడిశెట్టి శ్రీలక్ష్మి 6వ ర్యాంకు, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురానికి చెందిన గుండుబోగుల హరివీర శివసత్యనారాయణ 12వ ర్యాంకు సాధించారు. ఫిజికల్ సైన్సెస్‌లో తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరానికి చెందిన నువ్వుల ఈశ్వర్ హరి సాయికుమార్ 12వ ర్యాంకు సాధించాడు. పొలిటికల్ సైన్స్‌లో కాకినాడ జిల్లా కిర్లంపూడికి చెందిన నట్టే వీరవెంకట వేణు మహేశ్వరి 3వ ర్యాంకు, సంస్కృతంలో తూర్పుగోదావరి జిల్లా దేవరపల్లి మండలానికి చెందిన ములకల వెంకటలక్ష్మి 9వ ర్యాంకు, స్టేటస్టిక్స్ విభాగంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఉప్పలగుప్తానికి చెందిన కేశనకుర్తి వీరవెంకట సత్యవాణి 2వ ర్యాంకు, అమలాపురానికి చెందిన రాయుడు భార్గవి సాయి ప్రజ్ఞ 7వ ర్యాంకు, తెలుగులో కాకినాడ జిల్లా కాజులూరుకు చెందిన మేడిశెట్టి శిరీషాదేవి 2వ ర్యాంకు, ఇదే ప్రాంతానికి చెందిన కొండమూరి కాశీ కృష్ణవేణి 5వ ర్యాంకు, టూరిజంలో కాకినాడకు చెందిన యతిరాజ్య అభినయ సాయి 10వ ర్యాంకు, జువాలజీలో కాకినాడకు చెందిన కుప్పిలి భావన 9వ ర్యాంకు సాధించారు.

ఏపీఎడ్‌సెట్‌లో ప్రతిభ

ఏపీఎడ్‌సెట్ ఫలితాల్లో గణితశాస్త్రంలో కాకినాడ జిల్లా కాకినాడకు చెందిన కాకరపర్తి భావనాఫణిప్రియ రాష్ట్రస్థాయిలో ప్రథమ ర్యాంకు సాధించింది.

శనేశ్వరస్వామి ఆలయ హుండీల ఆదాయం లెక్కింపు



కొత్తపేట, జూన్27: మందపల్లి మందేశ్వర(శనేశ్వర)స్వామి ఆలయంలోని హుండీలు గురువారం తెరిచి కానుకలను లెక్కించారు. శనేశ్వరస్వామికి హుండీల ద్వారా రూ.2.94లక్షలు, ఆలయ ప్రాంగణంలో గల వేణుగోపాల స్వామికి హుండీలద్వారా రూ.13,072, అన్నప్రసాద హుండీ ద్వారా రూ.8,784 ఆదాయం వచ్చినట్టు సహాయ కమిషనరు, ఈవో కె.విజయలక్ష్మి తెలిపారు. ప్రత్యేకాధికారి వీవీవీఎస్ కామేశ్వరరావు, మాజీ సర్పంచ్‌లు చింతా విజయకృష్ణ మోహన్, సిద్దంశెట్టి వీర వెంకటసత్యనారాయణ, వీఆర్వో ఉత్తరకుమారి, సాదు చెంచయ్య ఆర్యవైశ్య సేవాదళం సభ్యులు పాల్గొన్నారు.

వాడపల్లి ఆదాయం రూ.1.71 లక్షలు

ఆత్రేయపురం, జూన్ 27: కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీవేంకటేశ్వరస్వామిని గురువారం అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. వివిధ సేవల ద్వారా ఒక్కరోజు ఆదాయం రూ.1,71,407 లభించినట్టు ఈవో, ఉప కమిషనరు భూపతిరాజు కిశోర్‌కుమార్ తెలిపారు. అన్నదాన ట్రస్టుకు పలువురు దాతలు విరాళాలు అందజేశారు.

రూ.1753 కోట్ల టర్నోవర్‌తో రెండో స్థానం

ఈ ఏడాది మార్చి నెలాఖరునాటికి రూ.13.93 కోట్ల లాభాలు

కాకినాడ కోఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ చిట్టూరి రవీంద్ర

కాకినాడ సిటీ, జూన్ 27: రాష్ట్రంలో 46 సహకార కోఆపరేటివ్ అర్బన్ బ్యాంకులుండగా, కాకినాడ కోఆపరేటివ్ టౌన్ బ్యాంక్ రూ.1753 కోట్ల టర్నోవర్‌తో రెండో స్థానంలో ఉందని, ఈ ఏడాది మార్చి నెలాఖరు నాటికి రూ 13.93 కోట్ల లాభాలను ఆర్జించిందని బ్యాంక్ చైర్మన్ చిట్టూరి రవీంద్ర పేర్కొన్నారు. కాకినాడలోని ఓ హోటల్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బ్యాంకు 45వ వార్షిక ఆడిట్ నివేదిక వివరాలను వెల్లడించారు. వినియోగదారుల సౌకర్యార్థం రానున్న కాలంలో నర్సీపట్నం, నూజివీడు, విజయనగరం, శ్రీకాకుళం, భీమవరం, పిఠాపురంలో నూతన బ్రాంచ్‌లను ఏర్పాటు చేయనున్నామన్నారు. ఈ ఏడాది మార్చి నెలాఖరు నాటికి రూ.1,056.73 కోట్లు డిపాజిట్లు, రూ 696.47 కోట్ల రుణాలు, రూ.447.35 కోట్లు ఇన్వెస్ట్‌మెంట్లు ఉన్నాయని తెలిపారు. అలాగే బ్యాంకు రూ.172.13 కోట్ల సొంత నిధులు కలిగి ఉందన్నారు. బ్యాంకుకు 53 వేల 360 మంది సభ్యులు రూ.30.37 కోట్ల వాటా ధనం కలిగి ఉన్నారని, ఈ ఏడాది ఒక్కో సభ్యునికి 15 శాతం డివిడెండ్ ఇచ్చేందుకు పాలకవర్గం ఆమోదించిందన్నారు. బ్యాంకు డిపాజిట్లు రూ.1,000 కోట్లు దాటడంతో రిజర్వ్ బ్యాంకు వారు టౌన్ బ్యాంక్ టైర్-త్రీ బ్యాంక్‌గా గుర్తించిందన్నారు. రాష్ట్రంలో విశాఖపట్నం బ్యాంక్ తర్వాత కాకినాడ టౌన్ బ్యాంక్ మాత్రమే టైర్-త్రీ బ్యాంక్‌గా ఉందన్నారు. అదే విధంగా ప్రతి ఖాతాదారుడు పాన్ కార్డు, ఆధార్ కార్డు అనుసంధానం చేసుకోవాలని, దీని నిమిత్తం బ్యాంకు ఎటువంటి రుసుం వసూలు చేయదన్నారు. ఈ సమావేశంలో బ్యాంక్ వైస్‌చైర్మన్ తోట సుధీర్, డైరెక్టర్లు కంటిపూడి సత్యనారాయణ, రిమ్మలపూడి ధర్మేంద్ర, సీఈవో సి.సుగుణరావు, సహ సీఈవో బీఎస్‌వీ సుహాస్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న బ్యాంకు చైర్మన్ చిట్టూరి రవీంద్ర



సిబ్బందితో మాట్లాడుతున్న మంత్రి సుభాష్

పేదలకు మెరుగైన సేవలందించాలి

రామచంద్రపురం ఏరియా ఆస్పత్రిలో మంత్రి సుభాష్ తనిఖీలు

రామచంద్రపురం(ద్రాక్షారామ), జూన్ 27: ప్రభుత్వాసుపత్రులకు పేదలు వస్తారని వారికి మెరుగైన సేవలు అందించాలని వైద్యులు, సిబ్బందిని మంత్రి వాసంశెట్టి సుభాష్ కోరారు. గురువారం రామచంద్రపురం ఏరియా ఆసుపత్రిని మంత్రి సుభాష్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాజీ కౌన్సిలర్ అల్లం శ్రీనివాస్ మాట్లాడుతూ సాయంత్రం 4 గంటలు దాటితే వైద్యులు అందుబాటులో ఉండటం లేదని, దీంతో ప్రాథమిక చికిత్స జరగడం లేదని కాకినాడ ఆసుపత్రికి రిఫర్ చేస్తున్నారని మంత్రి దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో మంత్రి వైద్య సిబ్బందిపై అసహనం వ్యక్తం చేశారు. ఆసుపత్రిలో రక్త తదితర పరీక్షలకు ప్రైవేటు ల్యాబ్‌లకు సిఫార్సు చేస్తున్నారని పలువురు ఫిర్యాదు చేశారు. మంత్రి రికార్డులు పరిశీలిస్తుండగా ప్రైవేటు ల్యాబ్‌ల లెటర్‌ప్యాడ్స్ కనిపించడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏమిటిది ఏం జరుగుతుందని మండిపడ్డారు. వెంటనే సెకండరీ హెల్త్ డైరెక్టరుకు ఫోన్ చేసి పరిస్థితి వివరించారు. ఎట్టి పరిస్థితుల్లో సామాన్యులను ఇబ్బంది పెట్టొద్దు, అన్ని రకాల పరీక్షలు ఆసుపత్రిలో నిర్వహించాలని ఆదేశించారు. సామాన్య రోగులను ఇబ్బంది పెడితే సహించబోనన్నారు. జనరిక్ మందులు షాపులో బయట మందులు పెట్టి అధిక రేట్లకు విక్రయిస్తున్నారని ఫిర్యాదుపై మందుల షాపును పరిశీలించారు. ఎట్టి పరిస్థితుల్లో బయట మందులు వైద్యులు సిఫార్సు చేయవద్దని, అన్ని రకాల మందులు జనరిక్ షాపులో అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. అవుట్‌సోర్సింగ్ పారిశుధ్య సిబ్బంది విధులకు సక్రమంగా హాజరుకాని వారిని తొలగించాలని ఆసుపత్రి సూపరింటెండెంట్‌ను ఆదేశించారు. ఆసుపత్రిలో పలువార్డుల్లో చికిత్స పొందుతున్న రోగులతో మంత్రి సుభాష్ మాట్లాడారు. బ్లడ్ బ్యాంకు, ల్యాబ్ ఇతర వార్డులు పరిశీలించారు. ఆసుపత్రిలో ఖాళీగా ఉన్న వైద్యుల పోస్టుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. నియామక ప్రక్రియ చేపట్టగానే పోస్టుల భర్తీ చేస్తామని తెలిపారు. జనసేన పట్టణ అధ్యక్షుడు గొల్లపల్లి కృష్ణ, టీడీపీ నాయకులు రాయపురెడ్డి రాజా, రవ్వా భూషణం, శివ, టేకుమూడి సత్యనారాయణ, మేడిశెట్టి శేషారావు జనసేన, టీడీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

మరో ఇద్దరికి డయేరియా

రంగంపేట, జూన్ 27: రంగంపేట మండలం ఈలకొలను గ్రామం శివారు అచ్యుతాపురంలో డయేరియా ప్రబలడంతో గురువారం మరో ఇద్దరు అస్వస్థతకు గురయ్యారు. దీంతో వారికి వైద్య సేవలందించి అనంతరం మెరుగైన వైద్యం నిమిత్తం రాజమహేంద్రవరంలోని ప్రైవేటు ఆసుపత్రికి పంపించినట్లు రంగంపేట పీహెచ్‌సీ వైద్యాధికారి బి.వేణుశ్రీలక్ష్మి తెలిపారు. గురువారం రాజమహేంద్రవరం డీఎంఅండ్‌హెచ్‌వో కార్యాలయం నుంచి అత్యవసర వైద్య విభాగ బృందం వైద్యులు రాజీవ్, సుధీర్, మెడికల్ కళాశాల వైద్యాధికారులు, టెక్నికల్ సిబ్బంది గ్రామంలో పర్యటించి వాటర్ ట్యాంక్‌లను, పైపులైన్‌లను, డ్రైనేజీ, శానిటేషన్ పనులను పరిశీలించారు. వాటర్, బాధితుల మలం శాంపిల్స్‌ను పరీక్ష నిమిత్తం రాజమహేంద్రవరం తీసుకెళ్లారు. టీడీపీ రాష్ట్ర లీగల్ సెల్ కార్యదర్శి నీలపాల త్రిమూర్తులు, డీఎల్‌పీవో ఎం.నాగలత, ఈవోపీఆర్డీ టి.వెంకటరత్నం గ్రామంలో పర్యటించి శానిటేషన్ పనులను పర్యవేక్షించారు. పీహెచ్‌సీ వైద్యులు వేణుశ్రీలక్ష్మి, చిన్నారావు ఆధ్వర్యంలో వైద్యశిబిరం నిర్వహిస్తున్నారు. పారామెడికల్ సిబ్బంది నాలుగు టీమ్‌లుగా ఏర్పడి గ్రామంలో ఇంటింటా సర్వే నిర్వహిస్తున్నారు. ప్రతిఒక్కరూ కాచి చల్లార్చిన నీటిని తాగాలని, మాంసాహారాలు తినవద్దని, వండిన ఆహార పదార్థాలపై తప్పనిసరిగా మూతలు పెట్టాలని సూచించారు. బుధవారం డయేరియాతో అస్వస్థతకు గురైన ఆరుగురు పూర్తిగా కోలుకున్నారని, గ్రామంలో పరిస్థితి అదుపులోనే ఉందని డాక్టర్ వేణుశ్రీలక్ష్మి చెప్పారు. కార్యక్రమంలో సీహెచ్‌వో కె.జయమణి, ఎంపీహెచ్‌ఈవో ప్రసాద్, ఎంపీహెచ్ఎస్ పి.రాజేశ్వరరావు, ఏఎన్ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.



వైద్య శిబిరం నిర్వహిస్తున్న సిబ్బంది

సీనియర్ విద్యార్థుల దాడితో మనస్తాపం

బీటెక్ విద్యార్థి ఆత్మహత్యాయత్నం



చికిత్స పొందుతున్న శివగంగాధర్

ప్రత్తిపాడు, జూన్ 27: సీనియర్ విద్యార్థులు దాడి చేయడంతో అవమాన భారంతో ప్రత్తిపాడు మండలం ఒమ్మంగి గ్రామానికి చెందిన బీటెక్ విద్యార్థి బుధవారం రాత్రి పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. వెంటనే ప్రత్తిపాడులోని ఆసుపత్రికి తరలించారు. దీనికి సంబంధించి బాధితుడి బంధువులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఒమ్మంగి గ్రామానికి చెందిన కంచి శివగంగాధర్ గొల్లప్రోలు మండలం చేబ్రోలు ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ రెండో సంవత్సరం చదువుతున్నాడు. బుధవారం కళాశాలకు బస్సులో వెళుతుండగా అదే కళాశాలలో చదువుతున్న కొంత మంది సీనియర్ విద్యార్థులు పోలీసులమని చెప్పి బస్సు దింపి కారులో ఎక్కించుకుని చేబ్రోలు తీసుకెళ్లి దాడి చేసి భయభ్రాంతులకు గురి చేశారు. ఎందుకు కొట్టారో తెలియక అవమాన భారంతో ఒమ్మంగి వచ్చి బుధవారం రాత్రి పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. దీంతో కుటుంబ సభ్యులు అపస్మారక స్థితిలో ఉన్న శివను ప్రత్తిపాడులోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించి వైద్యం అందిస్తున్నారు. దీంతో బాధితుడు మేనమామ పెనుమాకుల శివ గొల్లప్రోలు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

లారీ ఢీకొని వ్యక్తి మృతి

గండేపల్లి, జూన్27: జాతీయ రహదారిపై జెడ్.రాగంపేట డివైడర్ వద్ద గురువారం లారీ ఢీకొని వ్యక్తి మృతిచెందాడు. స్థానిక పోలీసులు సమాచారం ప్రకారం మల్లేపల్లి గ్రామానికి చెందిన చంద్రపాటి లోవరాజు(44) పనికి వెళ్లి జగ్గంపేట వైపు నుంచి మల్లేపల్లి వస్తుండగా జెడ్.రాగంపేట వద్దకు వచ్చేసరికి వెనుక వస్తున్న లారీ వేగంగా వచ్చి ఢీకొట్టి లోవరాజుపైకి ఎక్కడంతో ఆయన శరీరం లారీ చక్రాల కింద పడి నుజ్జునుజ్జైంది. అతని సొంతూరు లింగంపర్తి కాగా మల్లేపల్లిలో అత్తారిల్లో కాపురం ఉంటున్నాడు. లోవరాజుకు భార్య, కొడుకు ఉన్నారు. ఏఎస్ఐ శేఖర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అవార్డు ప్రదానం

అంబాజీపేట, జూన్ 27: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అంబాజీపేట ఉద్యాన పరిశోధన కేంద్రంలో పనిచేస్తున్న పి.మాలకొండయ్యకు మెరిటోరియస్ ఎంప్లాయిస్ అవార్డును ఉద్యాన విశ్వవిద్యాలయ ఉపకులపతి డాక్టర్ టి.జానకీరామ్ అందించారు. తాడేపల్లిగూడెం సమీపంలోని వెంకటరామన్నగూడెంలోని ఉద్యాన విశ్వవిద్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఈ అవార్డును, రూ.2,500 నగదు, ప్రశంసాపత్రాన్ని కొండయ్యకు అందించారు. కొండయ్యను స్థానిక పరిశోధన కేంద్రం అధిపతి డాక్టర్ ఎన్‌బీవీ చలపతిరావు, శాస్త్రవేత్తలు డాక్టర్ వి.గోవర్ధనరావు, బి.నీరజ, వి.అనూష, ఎ.కిరిటీ, సిబ్బంది అభినందనలు తెలిపారు.



అవార్డు అందుకుంటున్న మాలకొండయ్య

శతాధిక వృద్ధురాలి మృతి



ఆలమూరు, జూన్ 27: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆలమూరు మండలం నర్సిపూడికి చెందిన కొక్కిరిమెట్ల గాంధారమ్మ (112) గురువారం మృతి చెందారు. ఈమెకు నలుగురు కుమార్తెలు, ఒక కుమారుడు కాగా ముగ్గురు కుమార్తెలు జీవించి ఉన్నారు. మనుమలు, మనుమరాండ్లు, మునిమనుమలు, మునిమనుమరాళ్లు కలిపి 120 మంది ఉన్నారు. గాంధారమ్మ మృతికి పలువురు సంతాపం తెలిపారు.

గాయపడిన కొండచిలువకు ఆపరేషన్..మృతి



ఆపరేషన్ నిర్వహిస్తున్న సిబ్బంది

ప్రత్తిపాడు, జూన్27: గుర్తుతెలియని వాహనం పైనుంచి వెళ్లిపోవడంతో తీవ్రంగా గాయపడ్డ ఓ కొండచిలువను బతికించేందుకు పశు వైద్యులు తీవ్రంగా ప్రయత్నించారు. అయినప్పటికీ కొండచిలువ మృతిచెందింది. ఈ సంఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. ఏలేశ్వరం ఫారెస్ట్ రేంజ్ పరిధిలో రోడ్డు మార్గం దాటుతున్న కొండచిలువపై గుర్తు తెలియని వాహనం దూసుకువెళ్లింది. దీంతో కొండచిలువ తీవ్రంగా గాయపడింది. ఏలేశ్వరం అటవీ శాఖ సిబ్బంది బుధవారం ప్రత్తిపాడు పశువుల ఆసుపత్రికి ఆ కొండ చిలువను తీసుకొచ్చారు. స్థానిక పశుసంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ సీహెచ్ బాలచంద్రయోగేశ్వర్, పశువైద్యాధికారి సతీష్‌కుమార్ బృందం ఈ కొండ చిలువకు ఆపరేషన్ చేసి కుట్లు వేశారు. ఆపరేషన్ అనంతరం దాని సంరక్షణ కోసం రాజమహేంద్ర వరంలో అటవీ శాఖ పునరావాస కేంద్రానికి తరలించారు. అయితే అక్కడ ఈ కొండ చిలువ గురువారం తెల్లవారుజామున మృతి చెందింది. దీంతో ఆ కొండ చిలువకు ఏలేశ్వరం ఫారెస్ట్ శాఖకు చెందిన ఎఫ్ఆర్‌ఓ దుర్గారాంప్రసాద్, సిబ్బంది ఏలేశ్వరం తరలించగా గురువారం సాయంత్రం ప్రత్తిపాడు పశుసంవర్ధక శాఖ సహాయ సంచాలకుడు డాక్టర్ బాలచంద్రయోగేశ్వర్, పశువైద్యాధికారి సతీష్‌కుమార్ బృందం పోస్టుమార్టం నిర్వహించింది. అనంతరం మృతి చెందిన కొండ చిలువను నిర్మానుష్య ప్రదేశంలో ఫారెస్ట్ సిబ్బంది పూడ్చివేశారు. కొండ చిలువ ప్రాణాలు కాపాడటానికి అటవీ శాఖ, పశుసంవర్ధక శాఖ అధికారులు శ్రమించినప్పటికీ ఫలితం దక్కలేదు.

రామోజీరావు విగ్రహం అందజేత

విగ్రహాన్ని రూపొందించిన మాధవరావు

ముమ్మిడివరం, జూన్ 27: ఈనాడు గ్రూపు సంస్థల అధినేత రామోజీరావు విగ్రహాన్ని తయారుచేసిన ముమ్మిడివరం మండలం గాడిలంకకు చెందిన శిల్పి పెద్దిరెడ్డి మాధవరావు గురువారం రామోజీరావు కుటుంబ సభ్యులకు విగ్రహాన్ని అందజేశారు. విజయవాడలోని కానూరులో గురువారం జరిగిన రామోజీరావు సంతాప సభలో తాను రూపొందించిన రామోజీరావు విగ్రహాన్ని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్, రామోజీరావు కుటుంబ సభ్యులకు పెద్దిరెడ్డి మాధవరావు, అతని కుమారుడు రవీంద్ర అందజేశారు.



విగ్రహాన్ని నారా లోకేశ్‌కు అందిస్తున్న దృశ్యం

పీహెచ్‌డీలో ప్రవేశాలకు ఇంటర్వ్యూలు పూర్తి

దివాన్‌చెరువు, జూన్ 27: ఏపీ ఆర్‌సెట్‌లో అర్హత సాధించిన జియాలజీ, మేనేజ్‌మెంట్ విభాగాల్లో ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలోని స్థానిక ప్రాంగణంలో పీహెచ్‌డీలో ప్రవేశాలకు నిర్వహిస్తున్న ఇంటర్వ్యూలు గురువారం పూర్తయినట్టు ఉపకులపతి ఆచార్య కె.పద్మరాజు తెలిపారు. మేనేజ్‌మెంట్ విభాగంలో 321 మంది విద్యార్థులకు గాను 261 మంది ఇంటర్వ్యూలకు హాజరయ్యారన్నారు. అలాగే జియాలజీ స్కాలర్‌లు ఈ నెల 24న నిర్వహించిన ఇంటర్వ్యూలకు 34 మంది విద్యార్థులకు గాను 25 మంది హాజరయ్యారన్నారు. సెట్ కన్వీనర్ సూచనల మేరకు ఎంతో పారదర్శకంగా జియాలజీ, మేనేజ్‌మెంట్ ఆచార్యుల సమక్షంలో ఇంటర్వ్యూలు నిర్వహించారని తెలిపారు.

కాకినాడ

'ప్రతి నియోజకవర్గంలో గురుకులాలు ఏర్పాటు చేయాలి'

కార్పొరేషన్(కాకినాడ), జూన్ 27: ఏపీలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, ఓసీ పేదలకు నూతనంగా ప్రతి నియోజకవర్గంలో గురుకులాలు ఏర్పాటు చేయాలని ఆలిండియా పాఠశాలల పేరెంట్స్ అసోసియేషన్ అప్పా చైర్మన్ డాక్టర్ పిల్లా చంద్రం కోరారు. గతంలో టీడీపీ అధికారంలోఉండగా జిల్లాకొక గురుకుల పాఠశాల ఏర్పాటుకు ఆర్డినెన్స్ జార్జీ వైసీపీ రద్దు చేసిందన్నారు. 2018నుంచి అనేక ఉద్యమాలు చేశామన్నారు. మళ్లీ టీడీపీ అధికారంలోకి రావడం సంతోషకరమని గురుకులాల ఏర్పాటుపై చర్యలు తీసుకోవాలన్నారు.

పుడమి పులకింత

- మెట్టలో ఎడతెరిపిలేని వర్షం
- రహదారులు జలమయం
- ఆనందం వ్యక్తం చేస్తున్న రైతులు
- విత్తనాలు కొనుగోలులో బిజీబిజీ


తునిలో జాతీయ రహదారిపై ఎడతెరిపిలేకుండా కురుస్తున్న వర్షం

తుని రూరల్, జూన్ 27: రుతుపవనాలు, బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ద్రోణి ప్రభావంతో జిల్లాలో వర్షాలు కురుస్తున్నాయి. రైతుల్లో తొలకరి ఆనందం మొదలైంది. మొన్నటి వరకు విపరీతమైన ఎండలు, వేడిగాలులతో ఇబ్బందికి గురిచేసిన వాతావరణం ఒక్కసారిగా చల్లబడటంతో బుధవారంరాత్రి నుంచి ఎడతెరుపులేని వర్షం కురుస్తుండటంతో రైతుల్లో ఆనందం మొదలైంది. ఇప్పటికే ముమ్మరంగా వ్యవసాయసాగు మొదలవ్వాల్సి ఉండగా వర్షాలు కురవకపోవడం ఎండ ప్రభావంతో ఖరీఫ్ వ్యవసాయ సీజన్ ఆలస్యంగా మొదలైంది. మెట్టలో రైతులు ఇప్పటికే దుక్కులు దున్ని సాగుకు సిద్ధంగా ఉన్నారు. కురుస్తున్న వర్షాలకు నారుమడులు సిద్ధం చేసేందుకు రైతులు సన్నద్ధమవుతున్నారు. ప్రభుత్వ ఆర్బీకేల్లో, ప్రైవేట్ విత్తన దుకాణాలకు రైతులు క్యూ కడుతున్నారు.

వర్షంతో చల్లబడిన వాతావరణం

పిఠాపురం: పిఠాపురం పట్టణం పరిసర ప్రాంతాల్లో కురిసిన వర్షంతో వాతావరణం చల్లబడింది. రహదారులు జలమయమయ్యాయి. కొన్నిరోజులుగా ఎండతీవ్రతతో సతమతమైన ప్రజలు సేదతీరారు. ఎట్టకేలకు మేఘాలు వర్షించాయి. కొద్దిరోజులుగా ఎండతీవ్రత, ఉక్కపోతతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. రుతుపవనాలు ప్రవేశించినా ఉపరితల ఆవర్తన ద్రోణి ప్రభావంతో వర్షాలు పడకపోగా ఎండలు అధికమయ్యాయి. జూన్ మొదటివారంలో కురవాల్సిన వర్షాలు ఆలస్యం కావడం, ఎండలు పెరిగిపోవడంతో ప్రజలు గ్రీష్మతాపానికి గురవుతూ వచ్చారు. గత వారం రోజులుగా ఆకాశంలో మేఘాలు ఉన్నా ఎండ వేడి తీవ్రత వేసవిని తలపించింది. బుధవారం సాయంత్రం నుంచి ఆకాశం మేఘావృతమైనప్పటికీ పిఠాపురం పట్టణంలో గురువారం తెల్లవారుజామున వర్షం కురవడం ప్రారంభమైంది. సాయంత్రం వరకూ చినుకులు పడుతూనే ఉన్నాయి. మధ్యమధ్యలో భారీవర్షం కురిసింది. వర్షంతో పట్టణంలోని ప్రధానరహదారులన్నీ జలమయమయ్యాయి. చర్చిసెంటర్, ఉప్పాడసెంటర్, అంబేడ్కర్ సెంటర్, పోలీస్‌స్టేషన్ ఏరియా, మంగాయమ్మరావుపేట, విద్యుత్‌నగర్, చిట్టోడితోట, తారకరామనగర్, జగ్గయ్యచెరువుల కాలనీ, యానాదుల కాలనీ, భీమ్‌నగర్ తదితర ప్రాంతాల్లో రోడ్లపై నీరు ప్రవహించింది. వాతావరణం చల్లబడటంతో ప్రజలు ఊపిరిపీల్చుకున్నారు. మండలంలోని పలు గ్రామాల్లో వర్షం కురిసింది.

గొల్లప్రోలు: వర్షంతో వాతావరణం చల్లబడటంతో ప్రజలు ఊరట చెందారు. భారీ వర్షాలు కురిస్తే పంటల సాగుకు అవకాశం లభిస్తుందని ఆశిస్తున్నారు. గొల్లప్రోలు పట్టణం, మండలంలోని గ్రామాల్లో గురువారం తెల్లవారుజాము నుంచి వర్షాలు పడ్డాయి. సాయంత్రం 5గంటల వరకూ అడపాదడపా వర్షం, ఆపై చినుకులు పడుతూనే ఉన్నాయి. వర్షం కారణంగా జాతీయరహదారితో పాటు పట్టణంలోని రోడ్లపై నీరు ప్రవహించింది. పలుచోట్ల డ్రెయిన్లు పొంగిపొర్లాయి. వర్షం కురిసినా పంటపొలాల్లో ఎక్కడా నీరు నిలవలేదు. ఎండిపోయి బీడువారిన పొలాల్లోకి నీరు ఇంకిపోయింది. మరో భారీ వర్షం కురిస్తే మెట్ట పంటల సాగుకు అవకాశం ఏర్పడుతుందని రైతులు ఆశిస్తున్నారు.

కొత్తపల్లి: కొత్తపల్లి మండలంలో గురువారం చిరుజల్లులు కురిశాయి. ఉదయం నుంచీ సాయంత్రం వరకు జల్లులు పడుతూనే ఉన్నాయి. కేవలం జల్లులు పడటంతో గ్రామాల్లో రోడ్లన్నీ చిత్తడిగా మారాయి. ఉప్పాడ పిఠాపురం రోడ్డులో చేలల్లోంచి ట్రాక్టర్లపై తరలిస్తున్న మట్టి రోడ్డుపై చిందరవందరగా పడటంతో జల్లులతో మట్టి నాని రోడ్లపై బైక్‌లతో ప్రయాణించే ప్రయాణికులు జారి గాయాలపాలవుతున్నారు.


వర్షంతో పిఠాపురం మండలం విరవాడలో రోడ్లపై నిలిచిన నీరు

వర్షంతో మెట్ట రైతులకు ఊరట

జగ్గంపేట: జగ్గంపేట నియోజకవర్గంలో గురువారం ఉదయం నుంచి మోస్తరు వర్షం కురవడంతో మెరక వ్యసాయానికి కలిసి వస్తుందని రైతులు వాపోతున్నారు. ముఖ్యంగా ఇప్పటికే పెద్దాపురం, జగ్గంపేట, గండేపల్లి, కిర్లంపూడి, ఏలేశ్వరం ఏజెన్సీ మండలాల్లో దుంప సాగును మొదలు పెట్టారు. ఇటీవల అధికశాతం ఎండ కాయడంతో పంట పాడవుతుందని ఇబ్బందులు పడుతున్న తరుణంలో తుఫాను కారణంగా గురువారం కురిసిన వర్షానికి మెట్ట, ఏజెన్సీ ప్రాంతాల్లో వేసిన దుంప కూరగాయల పంటలకు ప్రాణం పోసినట్లయిందని రైతులు తెలియజేస్తున్నారు.

జగన్ ఫొటోతోనే సచివాలయ బోర్డు


రేచెర్లపేట సచివాలయం బోర్డులో తొలగించని జగన్ ఫొటో

కాకినాడ సిటీ, జూన్ 27: రాష్ట్రంలో కొత్తగా ఏర్పడిన కూటమి ప్రభుత్వం గతంలో జగన్ పేరుతోగల పథకాల పేర్లు మారుస్తూ, పాస్ పుస్తకాలు, కిట్లపై జగన్ ఫొటోను తొలగిస్తుంటుంటే కాకినాడ నగరంలో మాత్రం కొన్ని చోట్ల సచివాలయ సిబ్బంది ప్రభుత్వం మారిందన్న విషయం నుంచి ఇంకా తేరుకున్నట్లు లేదు. ఇందుకు స్థానిక 7వ డివిజన్ రేచెర్లపేట సచివాలయం బోర్డులోని జగన్ ఫొటో తొలగించకుండా ఉంచడమే తార్కాణంగా నిలుస్తుంది. వైసీపీ అధికారంలో ఉండగా సన్నిహితంగా తిరిగిన కొందరు సిబ్బంది ఇంకా వారి భ్రమల్లోనే ఉన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశాలమేరకు గత ప్రభుత్వం జగన్ ఫొటోతో ఇంత వరకు ఇచ్చిన భూహక్కు పత్రాలను రైతుల నుంచి వెనక్కి రప్పిస్తున్నారు. 2019 నుంచి 2024 మధ్య వైసీపీ ప్రభుత్వ హయాంలో మార్చిన కాలనీలు, ఆడిటోరియాల పేర్లను తొలగించి అంతకుముందు టీడీపీ ప్రభుత్వంలోని పాత పేర్లతో కొనసాగించాలని, ఈ ఐదేళ్లలో కొత్తగా పెట్టిన పేర్లను నిలుపుదల చేయాలని ప్రభుత్వం ఇప్పటికే ఆదేశించింది. కాకినాడలో అధికారులకు మాత్రం ఇవేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారు.

మత్స్యకార మహిళలకు కుట్టుమిషన్ల పంపిణీ



కాకినాడ సిటీ, జూన్ 27: రోటరీ సన్ రైజ్ క్లబ్ ఆధ్వర్యంలో మత్స్యకార మహిళలకు మౌత్ స్పీకర్లు, కుట్టుమిషన్లు పంపిణీ చేశారు. కోకనాడ చాంబర్ ఆఫ్ కామర్స్ భవనంలో గురువారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఉపకరణాలను సీపోర్ట్స్ డీజీఎం ఎస్‌వీ సుబ్రహ్మణ్యం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మత్స్య ఉత్పత్తుల విక్రయం నిమిత్తం మత్స్యకార మహిళలు వీధుల్లో తిరుగుతుంటారని, వీటి విక్రయాలకోసం అరవడంవల్ల ఆరోగ్యంతోపాటు గొంతు సమస్యల బారిన పడుతున్నారన్నారు. అందువల్ల వారికి మౌత్ స్పీకర్లు, ఏ ఆధారం లేని మత్స్యకార మహిళలకు కుట్టుమిషన్లు అందించిన రోటరీ సన్ రైజ్ క్లబ్ సేవలు అభినందనీయమన్నారు. కార్యక్రమంలో రోటరీ సన్‌రైజ్ క్లబ్ అధ్యక్షుడు జీవీ కమల్ సందీప్, కార్యదర్శి నగధర్, ఫెసిలేటర్ ఏవీ రంగారావు, ఉమెష్ ఎంపైర్ చైర్‌పర్సన్ ఎం.విజయలక్ష్మి, ఎం.శ్రీకృష్ణవర్మ, వి.దుర్గారమేష్, ఏవీ హరిప్రసాద్, వి.శ్రీనివాస్, షేక్ నాగ్ బాషా, రామ్‌కుమార్, రుత్విక్, మల్లేష్, సింహాద్రి పాల్గొన్నారు.

రక్తదాతలకు సత్కారం


రక్తదానం చేసిన అల్లవరపు నగేష్‌ను, జ్యోతుల శ్రీనివాస్, ధూళిపూడిని సత్కరిస్తున్న దృశ్యం

పిఠాపురం, జూన్ 27: రక్తదాతలు, రక్తదాన శిబిరాలు నిర్వహించే ఆర్గనైజర్లను రోటరీ బ్లడ్‌బ్యాంకు సత్కరించింది. 50 సార్లు రక్తదానం చేసి ప్రాణాపాయ స్థితిలో ఉన్న వారికి అండగా నిలవడంతోపాటు రక్తదాన శిబిరాల నిర్వహణలో కీలకపాత్ర పోషించిన పిఠాపురం మునిసిపల్ కౌన్సిలరు, మన ఊరు మన బాధ్యత స్వచ్ఛంద సంస్థ ప్రధాన కార్యదర్శి అల్లవరపు నగేష్‌ను కాకినాడలో జరిగిన కార్యక్రమంలో రోటరీ బ్లడ్‌బ్యాంక్ గోల్డెన్ జూబ్లీ చారిటబుల్ ట్రస్టు ప్రతినిధులు సత్కరించి విశిష్ట సేవా పురస్కారాన్ని అందజేశారు. రోటరీ బ్లడ్‌బ్యాంకు చైర్మన్ డాక్టర్ ఎస్.రామకృష్ణ, వైద్యుడు డాక్టర్ పి.కామరాజు, కార్యదర్శి వీవీ వర్మ పాల్గొన్నారు. రక్తదాన శిబిరాలకు క్యాంప్ ఆర్గనైజర్‌గా పనిచేసి వ్యవహరించి విశిష్ట సేవలు అందించిన సాయిప్రియ సేవాసమితి అధ్యక్షుడు జ్యోతుల శ్రీనివాస్‌ను సత్కరించారు.

రక్తదాత ధూళిపూడికి సత్కారం

తాళ్లరేవు, జూన్ 27: మానవతా దృక్పథంతో 80సార్లు రక్తందానం చేసి, రక్తదాన శిబిరాలను ప్రోత్సహించిన సామాజిక కార్యకర్త ధూళిపూడి వెంకటరమణను కాకినాడ రోటరీ బ్లడ్‌బ్యాంక్ ప్రతినిధులు గురువారం ఘనంగా సత్కరించారు. రోటరీ బ్లడ్‌బ్యాంక్ డాక్టర్ కామరాజు, రోటరీ డీజీపీ డాక్టర్ ఎస్‌వీఎస్ రావు, కార్యదర్శి వర్మలు సన్మానగ్రహీత సేవలను అభినందించారు.

పాఠశాల పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలి

- ఎంఈవో శివరామకృష్ణయ్య

సామర్లకోట, జూన్ 27:మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని సామర్లకోట మండల విద్యాశాఖాధికారి వై.శివరామకృష్ణయ్య ఆదేశించారు. గురువారం సామర్లకోట మండలంలోని పనసపాడు ఎంపీపీ పాఠశాలను ఎంఈవో శివరామకృష్ణయ్య ఆకస్మికంగా సందర్శించారు. విద్యార్థులు వినియోగించే టాయ్‌లెట్స్, మధ్యాహ్న భోజన పథకం అమలు గది, తదితర పరిసరాలను ఎంఈవో పరిశీలించి ప్రధానోపాధ్యాయులకు తగు సూచనలు జారీ చేశారు. విద్యార్థుల భాషా నైపుణ్యాలు, చతుర్విధ ప్రక్రియలు ఎలా ఉన్నాయో పుస్తకాలు పరిశీలించి తెలుసుకున్నారు. ప్రతీరోజూ విద్యార్థులకు ఉదయం బ్రేక్ సమయంలో పౌష్టికాహారంగా వేరుశనగ చిక్కీలు, రాగిజావలను తాగేలా ప్రధానోపాధ్యాయులు చర్యలు తీసుకోవాలన్నారు.

ఎమ్మెల్యే నానాజీని కలిసిన గణేష్ నిమజ్జన కమిటీ సభ్యులు

సర్పవరం జంక్షన్, జూన్ 27: కాకినాడ రూరల్, సిటీల్లో గణేష్ నిమజ్జన కార్యక్రమానికి ఎటువంటి ఇబ్బందులు లేకుండా సంపూర్ణ సహకారం అందించాలని నగర గణేష్ ఉత్సవ కమిటీ కన్వీనర్లు వై. మాలకొండయ్య, రంబాల వెంకటేశ్వరరావులు కోరారు. గురువారం గొడారిగుంటలో కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీని మర్యాద పూర్వకంగా కలిశారు. తన సంపూర్ణ సహకారం అందిస్తానని ఎమ్మెల్యే నానాజీ హామీ ఇచ్చారు.

సామర్లకోటలో పింఛన్ల పంపిణీకి సన్నాహాలు: ఎంపీడీవో

సామర్లకోట, జూన్ 27: ముఖ్యమంత్రి నారా చంద్రబాబు ఆదే శాల మేరకు సామర్లకోట మండలంలో సామాజిక పింఛన్లు పంపిణీ కార్యక్రమాన్ని జూలై 1నుంచి ప్రభుత్వ సిబ్బందితో మాత్రమే ఇంటింటా పంపిణీ చేయనున్నట్లు సామర్లకోట ఎంపీడీవో శ్యామ్‌సుందర్ పేర్కొన్నారు. గురువారం సాయంత్రం జిల్లా కలెక్టర్‌తో జిల్లాస్థాయి సమీక్షలో పాల్గొన్న అనంతరం ఎంపీడీవో శ్యామ్‌సుందర్ విలేకరులతో మాట్లాడారు.

'జగ్గమ్మగారిపేట మున్సిపల్ పాఠశాలకు మోక్షం కల్పించాలి'

సామర్లకోట, జూన్ 27: సామర్లకోట పట్టణ పరిధిలో జగ్గమ్మగారిపేటకు చెంది ప్రస్తుతం టీటీడీ కళ్యాణమండపం వద్ద ఉన్న అన్న క్యాంటీన్‌లో నిర్వహిస్తున్న మున్సిపల్ ప్రాథమిక పాఠశాలను జగ్గమ్మగారిపేటలోనే వేరొక భవనంలో కొనసాగించేలా చర్యలు తీసుకోవాలని కౌన్సిలర్లు పితాని కృష్ణ, బలుసు శ్రీనివాస్‌లు మున్సిపల్, మండల విద్యాశాఖాధికారులను డిమాండ్ చేశారు. ప్రభుత్వ నిర్ణయంతో అన్న క్యాంటీన్‌ను పునరుద్ధరించే అవకాశాలు ఉన్నందున ఇప్పటివరకూ కొనసాగిన పాఠశాలకు భవనం కొరత ఏర్పడిందన్నారు. ప్రాథమిక పాఠశాల చిన్నారులు కావడంతో సుదూరంగా ఉన్న మున్సిపల్ పాఠశాలల్లో విలీనం చేస్తే చిన్నారులకు దూరాభారంగా మారి డ్రాపవుట్స్ సమస్య నెలకొంటుందని వారు పేర్కొన్నారు. పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప దృష్టికి తీసుకువెళ్లి అందరికీ ఆమోదయోగ్యమైన రీతిలో మున్సిపల్ ప్రాథమిక పాఠశాలను కొనసాగించేలా చర్యలు తీసుకుంటామని కౌన్సిలర్లు పితాని కృష్ణ, శ్రీనివాస్‌లు చెప్పారు.

హైస్కూల్‌ను పరిశీలించిన జిల్లా విద్యాశాఖాధికారి

శంఖవరం, జూన్27: శంఖవరంలో జిల్లా పరిషత్ హైస్కూల్‌ను జిల్లా విద్యాశాఖాధికారి పిల్లి రమేష్ పరిశీలించారు. పాఠశాలలో గల విద్యకు సంబంధించిన అంశాలను, నాడు నేడు పనులను పరిశీలించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు హాజరును, విద్యార్థుల నోట్ బుక్స్‌ను పరిశీలించారు. ఎంతమంది విద్యార్థులు తెలుగు, ఇంగ్లీషు స్పష్టంగా చదువుతున్నారో అడిగి తెలుసుకున్నారు. వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేకశ్రద్ధ చూపాలన్నారు. ఈయన వెంట ఎంఈవో సూరిశెట్టి వెంకటరమణ, ప్రధానోపాధ్యాయురాలు టీబీ లక్ష్మి ఉన్నారు.

చిన్నారుల బంగారు భవిష్యత్తుకు అంగన్‌వాడీ కేంద్రాలు

సర్పవరం జంక్షన్, జూన్ 27: చిన్నారుల బంగారు భవిష్యత్తుకి మెట్లుగా అంగన్ వాడీ సెంటర్లు ఉన్నాయని ఐసీడీఎస్ సీడీపీవో వై.లక్ష్మి అన్నారు. గురువారం ఏపీఎస్పీ అంగన్‌వాడీ సెంటర్‌లో మన ఊరు మన అంగన్‌వాడీలో భాగంగా పలువురు చిన్నారులను చేర్చుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ సెంటర్లకు వచ్చే చిన్నారుల్లో మానసిక వికాసం పెంపొందేరీతిలో విద్య, ఆటలు, క్రీడలు నేర్పడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ బి. మార్తమ్మ, టీచర్లు రాజేశ్వరి, వై పద్మావతి, వై. పద్మజ, సీహెచ్ జ్యోతి, పరంజ్యోతి, యు అనురాధ, దేవి, తల్లులు పాల్గొన్నారు.

టీఎన్‌టీయూఎస్ రాష్ట్ర కార్యదర్శిగా కృష్ణమోహన్

జగ్గంపేట, జూన్ 27: తెలుగునాడు ఉపాధ్యాయ సంఘం(టీఎన్‌టీయూఎస్)రాష్ట్ర కార్యదర్శిగా ఎస్.కృష్ణమోహన్ జగ్గంపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సీనియర్ ఉపాధ్యాయులుగా పని చేస్తున్న కృష్ణమోహన్ ఎంపికయ్యారు. మంగళగిరిలోని ఎన్టీఆర్ భవన్‌లో తెలుగునాడు ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర కార్యవర్గ సమావేశం రాష్ట్ర అధ్యక్షులు మన్యం శ్రీనివాస్ అధ్యక్షతన జరిగింది. ముఖ్యఅతిథిగా టీడీపీ అధికార ప్రతినిధి పాతర్ల రమేష్ పాల్గొని 117జీవోను రద్దుచేయాలన్నారు. కార్యవర్గ సమావేశం ఏకగ్రీవంగా కృష్ణమోహన్‌ను రాష్ట్ర కార్యదర్శిగా, ఉభయగోదావరి జిల్లాల అధ్యక్షులుగా బాధ్యతలు అప్పగించారు.

అధికారులపై చర్యలు తీసుకోవాలి

సర్పవరం జంక్షన్, జూన్ 27: కాకినాడ 49వ డివిజన్ పైడావారి వీధిలో 1.92 ఎకరాల్లో ఎటువంటి అనుమతుల్లేకుండా అక్రమంగా నిర్మించిన జిల్లా వైసీపీ కార్యాలయం నిర్మాణానికి సహకరించిన అధికారులపై ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని మాజీ ఎంపీటీసీ పితాని రాము గురువారం విడుదల చేసిన ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. గజం రూ.70వేలు పైబడి ఉన్న ఏరియాల్లో ఎకరాకు ఏడాదికి వెయ్యి రూపాయల లీజుతో వైసీపీ లీజుకు తీసుకోవడం దారుణమన్నారు. గత రెండేళ్లుగా నిర్మాణం జరుగుతుంటే నగరపాలక, కుడా అధికారులు ఏంచేస్తున్నారని ప్రశ్నించారు.

రెండు రోడ్డు ప్రమాదాల్లో ఒక వ్యక్తి మృతి

సామర్లకోట, జూన్ 27: సామర్లకోట అచ్చంపేట ఏడీబీ రోడ్డులో గురువారం రాత్రి రెండు వేర్వేరు రోడ్డు ప్రమా దాలు జరిగాయి. రెండు ప్రమాదాలు వారికి వారే రోడ్డుపై ఉన్న గోతుల్లోపడి పడిపోవడంతో తలకు తీవ్ర గాయమై మృతి చెందాడు. మరో ప్రమాదంలో డివైడర్‌ను ఢీకొని ఒక వ్యక్త తీవ్రంగా గాయపడ్డాడు. కొప్పవరం జంక్షన్ సమీపాన జరిగిన ప్రమాదంలో కాకినాడ పో ర్టులో పనిచేస్తున్న కార్మికుడు మృతి చెందినట్లు తోటి కార్మికులు తెలిపారు. మరో ప్రమాదం ఫైవర్ డివైడర్‌ను ఢీకొనడంతో ఒకరు తీవ్రంగా గాయపడ్డారు. సామర్లకోట పోలీసులు ఆరా తీస్తున్నారు.

ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు

కిర్లంపూడి, జూన్27: కిర్లంపూడి పోలీస్‌స్టేషన్‌లో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదైనట్లు ఎస్‌ఐ జబీర్ తెలిపారు. కిర్లంపూడి శివాలయం శ్మశానవాటిక వద్ద మందేటి బాబి, ఉప్పాడ దుర్గారావు అనే వ్యక్తులను కిర్లంపూడి గ్రామానికి ఉమ్మిడిశెట్టి నానాజీ అనే వ్యక్తి కులం పేరుతో దూషించాడు. దీంతో ఆ ఇద్దరు నానాజీపై ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రైతులకు కౌలుకార్డు జారీపై అవగాహన సదస్సు

రౌతులపూడి, జూన్ 27 రైతులకు కౌలు కార్డులు జారీపై తహశీల్దార్ కార్యాలయంలో అవగహన సదస్సు నిర్వహించారు. తహశీల్దార్ విద్యాపతి అధ్యక్షత వ్యవసాయశాఖాధికారి రెడ్డి ఈశ్వరరావు సమక్షంలో సిబ్బందికి అవగాహన సదస్సు నిర్వహించారు. కౌలుకార్డు ఆవశ్యకత, ఉపయోగాలపై సిబ్బందికి తహశీల్దార్, వ్యవసాయాధికారి పలు సూచనలు చేశారు. కౌలు రైతులు లబ్ధిపొందే అన్నదాత సుఖీభవ పథకానికి భూ యజమానికి రెండున్నర ఎకరాలు తగ్గకుండా భూమి ఉండి దానిలో ఎకరం భూమి కౌలు చేస్తేనే అన్నదాత సుఖీభవ పథకం వస్తుందన్నారు. ఈకార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ పీవీవీ సత్యనారాయణ, రెవెన్యూ, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులందరికీ పుస్తకాలు, బ్యాగ్‌లు అందించాలి

కోటనందూరు, జూన్ 27: విద్యార్థులందరికీ పూర్తిస్థాయిలో పుస్తకాలు, బ్యాగ్‌లు అందించాలని సర్వశిక్షాభియాన్ జీసీడీవో ఉమా మహేశ్వరి అన్నారు. గురువారం మండలంలోని కేజీబీవీతోపాటు స్టాక్ పాయింట్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి విద్యార్థికి అన్నీ అందేలా చూడాలన్నారు. కార్యక్రమంలో ఎంఈవో 2 ఎమ్. శేఖర్ సీఆర్పీ యర్రా శేఖర్ పాల్గొన్నారు.

నిబంధనలు ఉల్లంఘించిన ప్రైవేట్ ఉన్నత పాఠశాల

- జిల్లా ఉపవిద్యాశాఖాధికారి ఆదేశాలు భేఖాతరు

సామర్లకోట, జూన్ 27: సామర్లకోట మండలం పెద్దబ్రహ్మదేవం గ్రామంలో ఒక ప్రైవేట్ ఉన్నత పాఠశాల అటు పంచాయతీ, ఇటు విద్యాశాఖల నిబంధనలను ఉల్లంఘించినప్పటికీ సదరు పాఠశాలను ప్రస్తుత విద్యాసంవత్సరం కూడా కొనసాగించేందుకు మండల విద్యా శాఖాధికారులు జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాలను భేఖాతరు చేశారన్న ఆరోపణలు సామర్లకోట మండల విద్యాశాఖాధికారులపై వెల్లువెత్తుతున్నాయి. పంచాయతీ అనుమతులు లేకుండా అక్రమ కట్టడాలు, పంచాయతీకి ఎటువంటి పన్నులు చెల్లించకుండా ఇష్టా రాజ్యంగా పాఠశాలను నిర్వహించడంపై గతేడాది గ్రామ ఎంపీటీసీ మలకల సూర్యారావు అప్పటి జిల్లాకలెక్టర్‌కు ఫిర్యాదులు చేయడంతో కలెక్టర్ విచారణకు ఆదేశించారు. దీంతో విచారణ నిర్వహించిన ఆర్డీడీ అధికారి సైతం డీవైఈవో అధికారిచే విచారణలు నిర్వహి ంచారు. తదుపరి విచారణలు నిర్వహించిన పంచాయతీ కార్యదర్శి సైతం 10అభ్యంతరాలను పాఠశాల యాజమాన్యం ఉల్లంఘించి నట్లు నిర్ధారించారు. దీంతో డీవైఈవో అధికారి సదరు పాఠశాల గుర్తింపు రెన్యువల్ ప్రతిపాదనలను తిరస్కరిస్తూ త్రిప్పి పంపారు. దీంతో 2024-25 విద్యాసంవత్సరానికి పాఠశాల కొనసాగించరాదన్న ఆదేశాలు ఉన్నప్పటికీ ఏ అనుమతులతో, ఎవరి ఆదేశాలతో పాఠశా లను కొనసాగిస్తున్నారో జిల్లా విద్యాశాఖాధికారులు తేల్చాలని ఎంపీటీసీ మలకల సూర్యారావు జిల్లా అధికారులను డిమాండ్ చేశారు.

కొత్త నేరచట్టాల అమలు అపాలని న్యాయవాదుల నిరసన

ప్రత్తిపాడు, జూన్ 27: కొత్త నేరచట్టాల అమలు అపాలని డిమాండ్ చేస్తూ గురువారం ప్రత్తిపాడులో న్యాయవాదులు నిరసన తెలిపారు. ఐలాజ్ ఆధ్వర్యంలో న్యాయవాదులు స్థానిక కోర్టు భవన సమీపంలో ఈ నిరసన కార్యక్రమం నిర్వహించారు. భారతీయ నాగరిక్ సురక్షా సంహిత, న్యాయ సంహిత, సాక్ష్య అధినీయం అనే మూడు నేరచట్టాలు జూలై 1నుంచి అమలు చేయనున్నారని వీటిని వెంటనే ఆపాలని న్యాయవాదులు డిమాండ్ చేశారు. వెంటనే ఈ న్యాయ నేర చట్టాలను నిలిపివేయాలని ఐలాజ్ ప్రతినిధి బుగతా శివ కేంద్రప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ ఆందోళనలో న్యాయవాదులు అవసరాల దేవి, పిల్ల బలరాముడు, కలవల పక్షొసుజనా, రాయి శ్రీనివాసరావు, గెడ్డం కామేశ్వరరావు, రెడ్డం వెంకట రెడ్డి, వెంకటలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

ఎస్పీ సతీష్‌కుమార్‌ను కలిసిన ఎమ్మెల్యే పంతం


ఎస్పీ సతీష్‌కుమార్‌కు పూలబొకే అందిస్తున్న ఎమ్మెల్యే పంతం

సర్పవరం జంక్షన్, జూన్ 27: కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ గురువారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ ఎస్ సతీష్‌కుమార్‌ను మర్యాద పూర్వకంగా కలుసుకుని పూలబొకే అందించారు. కాకినాడ సిటీ, రూరల్లో గంజాయి, మత్తు పదార్థాల అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపాలని, వీటిని ప్రోత్సహించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, యువత వీటి జోలికెళ్లకుండా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఎమ్మెల్యే నానాజీ ఎస్పీని కోరారు.

సత్యప్రభకు అధికారుల అభినందన


ఎమ్మెల్యే సత్యప్రభను ప్రత్తిపాడులో కలిసి అభినందిస్తున్న నాయకులు

ప్రత్తిపాడు, జూన్27: ప్రత్తిపాడు ఎమ్మెల్యేగా అసెంబ్లీలో పదవీ ప్రమాణస్వీకారం చేసి వచ్చిన వరుపుల సత్యప్రభ రాజాను ప్రత్తిపాడు స్థానిక టీడీపీ కార్యాలయంవద్ద గురువారం పలువురు అధికారులు, వివిధ గ్రామాల కూటమి శ్రేణులు అభినందించారు. స్థానికకంగా పలు ప్రభుత్వ శాఖల సిబ్బంది సత్యప్రభను కలిసి బొకేను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ప్రత్తిపాడు, ఏలేశ్వరం, శంఖవరం, రౌతులపూడి కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు ప్రత్తిపాడు తరలివచ్చిన సత్యప్రభను బొకేలు పూలమాలతో సత్కరించి అభినందించారు.

పర్యావరణ పరిరక్షణలో మేము సైతం

జగ్గంపేట, జూన్ 27: పర్యావరణ పరిరక్షణలో మేము సైతం అంటూ ఐటీసీ సహకారంతో ఏజీఎస్ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన వావ్ కార్యక్రమంలో జగ్గంపేట భాష్యం స్కూల్ విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ ప్రోగ్రాంలో నిర్వహించిన ఇంటర్ స్కూల్ రీ సైక్లింగ్ చాంపియన్ షిప్ సంబంధించి విద్యార్థులు సేకరించిన పాత పుస్తకాలు, పేపర్లను నిర్వాహకులకు అందజేశారు. అనంతరం వావ్ ప్రోగ్రాంలో స్కూల్ టాపర్‌గా నిలిచి ఇంటర్ స్కూల్ చాంపియన్‌షిప్‌ను కైవసం చేసుకున్న చింత మోహన్‌కృష్ణ, కొమ్మోజు వీరచరణ్ ప్రథమ, ద్వితీయస్థానాల్లో నిలిచారన్నారు. ఈ కార్యక్రమంలో ఏజీఎస్ రీజనల్ కో ఆర్డినేటర్ రాము, ప్రిన్సిపాల్ కుసిరెడ్డి సత్యనారాయణ, ఏజీఎస్ స్కూల్ కో-ఆర్డినేటర్ దుర్గబాబు, ప్రైమరీ ప్రిన్సిపాల్ వాణి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉప్పలంక ముంపు కాలనీలో అధికారుల పర్యటన

కరప, జూన్ 27: వర్షాలకు ముంపుబారిన పడిన ఉప్పలంక కొత్తకాలనీని గురువారం ఎంపీడీవో కొంకి అప్పారావు సందర్శించి సిబ్బందికి పలు సూచనలు జారీ చేశారు. సర్పంచ్ బొమ్మిడి నయోమి, కార్యదర్శి మానస, వీఆర్‌వో వెంకటేశ్వర్లు, తదితరులతో కలిసి కాలనీవాసులతో మాట్లాడారు. ఈ కాలనీలో పట్టాలు పొందిన లబ్ధిదారుల్లో నేటికీ 70శాతం మంది ఇళ్లు కట్టుకోకపోవడంతో ముంపునీరు ఇక్కడకు భారీగా చేరుతుందన్నారు. ఈ ముంపు వల్ల మిగిలిన 30శాతం మంది ఇళ్లు కట్టుకున్నవారు ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. లబ్ధిదారులు వెంటనే ఇక్కడ ఇళ్లు నిర్మించుకోవాలని, లేనిపక్షంలో పట్టాలను రద్దు చేసి కొత్తవారికి పట్టాలందజేస్తామని స్పష్టం చేశారు. దీనిపై లబ్ధిదారులకు నోటీసులు జారీచేసి తదుపరి చర్యలు తీసుకుంటామని ఎంపీడీవో తెలిపారు. ఈలోగా ముంపునీరు నిలబడకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని, ప్రత్యేక పారిశుద్ధ్య పనులు చేపట్టాలని సిబ్బందికి సూచించారు. వైసీపీ నాయకుడు బొమ్మిడి సతీష్, పాల్గొన్నారు.

బాల్యవివాహాలు, అతిసారపై కళాజాత

కిర్లంపూడి, జూన్ 27: మండలంలోని బూరుగుపూడి గ్రామంలో మహిళాభివృద్ధి, శిశుసంక్షేమశాఖ, జిల్లా బాలల పరిరక్షణ విభాగం సంయుక్త ఆధ్వర్యంలో బాల్య వివాహాలు, అతిసారపై కళాజాత కార్యక్రమం నిర్వహించారు. ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీవో ఎం.పూర్ణిమ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. బాలికలను చదివిద్దామనే విషయాన్ని ప్రతీఒక్కరూ గుర్తించుకోవాలన్నారు. బాల్య వివాహాలు చేయడం నేరమన్నారు. బాల్య వివాహాలు జరుగుతున్నట్లు తెలిస్తే చైల్డ్ హెల్ప్‌లైన్ ఉచిత సర్వీస్ నెంబర్ 1098 లేదా పోలీస్ 100కు సమాచారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో జిల్లా బాలల పరిరక్షణ విభాగం కౌన్సిలర్ బి.దుర్గారాణి, సూపర్‌వైజర్ షేక్‌ఖరీ మున్నిషా, అంగన్వాడీ సిబ్బంది, గ్రామ మహిళా సంరక్షణ కార్యదర్శులు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

టీడీపీ హయాంలో వ్యవసాయానికి పెద్దపీట

తొండంగి, జూన్ 27: టీడీపీ ప్రభుత్వ హయాంలో వ్యవసాయానికి పెద్దపీట వేసిందని టీడీపీ సీనియర్ నేత యనమల రాజేష్ అన్నారు. గురువారం ఆయన బెండపూడిలో రైతులకు వరి విత్తనాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు అవసరమైన అన్ని సదుపాయాలను టీడీపీ సమకూరుస్తుందన్నారు. రైతును రాజును చేసే విధంగా ప్రభుత్వం వ్యవహరిస్తుందన్నారు. కార్యక్రమంలో గ్రామాభివృద్ధి కమిటీ చైర్మన్ సాధనాల నూకరాజు, పాలచర్ల యర్రబ్బు, శ్రీనివసరావు, నాయుడు పాల్గొన్నారు.

ప్రభుత్వాసుపత్రిలో అరుదైన ఆపరేషన్

- తొడపై కణితి తొలగింపు

పిఠాపురం, జూన్ 27: పిఠాపురం ప్రభుత్వాసుపత్రిలో అరుదైన ఆపరేషన్ జరిగింది. ఒక వ్యక్తికి తొడపై ఉన్న కణితి(పెడున్సులేటెడ్ లిపోమా)ను తొలగించారు. కొత్తపల్లి మండలం కొండెవరం గ్రామానికి చెందిన జీలకర్ర లచ్చారావు అనే వ్యక్తి కుడి తొడపై కణితితో పది సంవత్సరాలుగా బాధపడుతున్నాడు. దీంతో పెడున్సులేటెడ్ లిపోమాగా పిలుస్తారు. పలు ప్రైవేటు ఆసుపత్రులకు వెళ్లినా ఫలితం లేకపోవడంతో పిఠాపురం పట్టణంలోని ప్రభుత్వాసుపత్రికి వచ్చారు. ఆసుపత్రిలో సర్జన్ స్పెషలిస్ట్‌గా పనిచేస్తున్న డాక్టర్ షేక్ షాబానా పరీక్షించి ఆపరేషన్ చేసేందుకు నిర్ణయించారు. గురువారం మత్తు వైద్యులు, ఇతర సిబ్బంది సహకారంతో ఆపరేషన్‌చేసి కణితిని తొలగించారు. ప్రస్తుతం లచ్చారావు ఆరోగ్యంగా ఉన్నారు. ఆపరేషన్ విజయవంతంగా చేసిన సర్జన్‌ను పలువురు అభినందించారు.

జిల్లా కలెక్టర్‌ను కలిసిన కమిషనర్


కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న కమిషనర్

కార్పొరేషన్(కాకినాడ), జూన్ 27: జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన షాన్ మోహన్‌ను కాకినాడ నగరపాలక సంస్థ కమిషనర్ జె.వెంకటరావు ఇతర అధికారులు గురువారం కలిశారు. కలెక్టరేట్‌లో వివిధ విభాగాధిపతులతో కలిసి కలెక్టర్‌ను కలిసిన కమిషనర్ పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందనలు తెలిపారు. నగరపాలక సంస్థ ఎస్ఈ పి.సత్యకుమారి, కార్యదర్శి ఎం.ఏసుబాబు, డిప్యూటీ కమిషనర్ గుంటూరు శేఖర్, స్మార్ట్ సిటీ సూపరింటెండెంట్ ఇంజనీరింగ్ ఎం.వెంకటరావు, డిప్యూటీ సిటీ ప్లానర్ హరిదాస్, ఎంహెచ్‌వో డాక్టర్ పృథ్వీచరణ్, ఉద్యాన సహాయ సంచాలకులు టీవీ శిరిల్, మేనేజర్ కర్రి సత్యనారాయణ, ఈఈ మాధవి ఉన్నారు.

కలెక్టర్‌ను కలిసిన జేఎన్టీయూకే వీసీ


కలెక్టర్ షాన్‌మోహన్‌కు పుష్పగుచ్ఛాన్ని అందజేస్తున్న వీసీ ప్రసాదరాజు

జేఎన్టీయూకే, జూన్ 27: జిల్లా నూతన కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన సగిలి షాన్‌మోహన్‌ను జేఎన్టీయూకే ఉపకులపతి ప్రొఫెసర్ జీవీఆర్ ప్రసాదరాజు, రిజిస్ట్రార్ ఎల్.సుమలత గురువారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. వర్సిటీలోని పలు అభివృద్ధి పనులు, మౌలిక వసతుల గురించి కలెక్టర్‌కు వివరించారు.

జిల్లా ప్రజా రవాణాధికారికి సత్కారం


జిల్లా ప్రజా రవాణాధికారిని సత్కరిస్తున్న దృశ్యం

కార్పొరేషన్(కాకినాడ), జూన్ 27: కాకినాడ రోటరీ క్లబ్ వారితో నిర్వహిస్తున్న బ్లడ్‌బ్యాంక్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాలు నిర్వహించే సంస్థల అధినేతలకు చేసిన సన్మానంలో భాగంగా జిల్లా ప్రజా రవాణాధికారి ఎం.శ్రీనివాసరావును ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో రోటరీ సభ్యులు, డిపో మేనేజర్ మనోహర్ ఉన్నారు.

డయేరియా ప్రబలకుండా పటిష్ట ప్రణాళిక

- కమిషనర్ జె.వెంకటరావు

కార్పొరేషన్(కాకినాడ), జూన్ 27: డయేరియాను అదుపు చేసేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నామని కాకినాడ నగరపాలక సంస్థ కమిషనర్ జె.వెంకటరావు తెలిపారు. ప్రభుత్వాదేశాల మేరకు స్టాప్ డయేరియా క్యాంపెయిన్-2024 కార్యక్రమంపై స్థానిక స్మార్ట్‌సిటీ కార్యాలయంలో శుక్రవారం ప్రజారోగ్య విభాగానికి చెందిన సిబ్బందితో కమిషనర్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆగస్టు 30 వరకు ఈ ప్రచార, అవగాహన కార్యక్రమం కొనసాగుతుందన్నారు. డయేరియా ప్రబలేందుకు అవకాశమున్న ప్రాంతాల్లో ఇప్పటి కే సర్వే చేశామన్నారు. ఆయా ప్రాంతాల్లో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలతోపాటు ప్రజలకు సంపూర్ణ అవగాహన కల్పిస్తున్నామన్నారు. తమ సర్వే ద్వారా హైరిస్క్ కేటగిరీ కింద 1691మంది గర్భిణులు, 1498మంది బాలింతలు, 14,500 మంది ఐదేళ్లలోపు చిన్నారులను గుర్తించామన్నారు. ఇప్పటికే 5266 కుటుంబాలకు అవసరమైన సహకారాన్ని కూడా అందించామన్నారు. సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి నరసింహానాయక్, ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ ప్రవీణ, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి రత్నకుమార్, కాకినాడ నగరపాలక సంస్థ ఎంహెచ్‌వో డాక్టర్ పృథ్వీచరణ్, డీపీఎంవో డాక్టర్ సురేఖ ఉన్నారు.

ఇస్కాన్ టెంపుల్ నిర్మాణంపై కొండబాబు చర్చ

కాకినాడ సిటీ, జూన్ 27: కాకినాడ నగరంలో ఇస్కాన్ టెంపుల్ నిర్మాణం, అక్షయపాత్ర ఫౌండేషన్ సేవలపై కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు చర్చించారు. ఇస్కాన్ ఫౌండేషన్ ప్రతినిధులు ఎమ్మెల్యే కొండబాబును గురువారం ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన ఇస్కాన్ టెంపుల్ నమూనా చిత్రాన్ని పరిశీలించారు. టెంపుల్ నిర్మాణం, తదితర అంశాలపై సూచనలు చేశారు. అక్షయ పాత్ర ఫౌండేషన్ ద్వారా స్కూల్ పిల్లలకు సరఫరా చేసే భోజనంపై చర్చించారు. సమావేశంలో ఇస్కాన్ ఫౌండేషన్ నిర్వాహకులు గురు వైకుంఠేశ్వర దాస పాల్గొన్నారు.


ఇస్కాన్ ఫౌండేషన్ ప్రతినిధులతో సమావేశమైన కొండబాబు